సోమశిలకు తగ్గిన వరద ప్రవాహం

అనంతసాగరం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. బుధవారం 6,343 క్యూసెక్కులు వస్తుండగా గురువారానికి 5,880 క్యూసెక్కులకు పడిపోయింది. డ్యాంలో 74.199 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 300, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సోమశిల ఆప్రాన్ బాగుకు అవకాశమిదే..! 8

మీన.. మీన... కాసుల వాన!





- రొయ్యల కంటే చేపలకే ప్రాధాన్యత
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సహజ సిద్ధంగా పెరిగే పైలట్, కొరమీను, మట్టగిడసలు
- గెండి, బొచ్చ రకం చేపలకూ ఆదరణ
- ఏటా 1.7 లక్షల టన్నుల ఉత్పత్తి
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- సంవత్సరానికి రూ.2వేలకోట్లకు పైగా టర్నోవర్
- నెల్లూరు పులుసు అంటే లొట్టలు వేయాల్సిందే!
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

నెల్లూరు చేపల పులుసు అంటే ఎవరైనా లొట్టలు వేయాల్సిందే. అందులోనూ రాగి సంగటితో కలిపి అంటే ఇక ఆ గిన్నె ఖాళీ కావాల్సిందే. కొరమీను, మట్టగిడసల పులుసుకు ఎవరైనా ఆహా.. అనాల్సిందే. వివిధ కార్యాల విందు మెనూలో చేపల పులుసును తప్పనిసరిగా జోడిస్తున్నారు. జిల్లా వాతావరణం, నేల స్వభావం, నీటి అనుకూలతే ఇందుకు కారణమని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. దేశ, విదేశాల్లోనూ ఎంతో పేరు గడించిన నెల్లూరు చేపల్లో రెండే రెండు రకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకటి గెండి.. మరొకటి బొచ్చు. దాదాపుగా 75 శాతం మంది సాగుదారులు వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తరువాత మోసు, రూప్‌చంద్ రకం చేపల సాగుకు కొంతమంది ముందుకొస్తున్నారు. అయితే జలాశయాలు, చెరువులు, కాలువలు, నదుల్లో మాత్రం సహజ సిద్ధంగా పెరుగుతున్నవి మాత్రం కొరమీను, పైలట్, మట్టగిడసలు. ఇవి ఆయా ప్రాంతాల్లో వినియోగానికే సరిపోతున్నాయి. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక కథనం..

వివరాలు 8లో..

బుల్లెట్ ట్రైన్ కోసం రైల్వే లైను

- మనుబోలు వద్ద మట్టి నమూనాల సేకరణ



మడమనూరు వద్ద మట్టి నమూనాలు తీసే యంత్రం

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడున్న రైల్వేలైను కాకుండా రాష్ట్రంలో అదనపు రైల్వేలైన్లకు అడుగులు పడనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బెంగళూరు రాష్ట్రాలను కలుపుతూ రైల్ కారిడార్ రానుంది. ఈ మార్గంలో హైస్పీడు, బుల్లెట్ రైళ్లు వెళ్ళే విధంగా లైన్లు వేయనున్నట్లు తెలిసింది. దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (సర్వే) శ్రీవాత్సవ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పలుచోట్ల రైల్వే ఇంజనీరింగ్, సర్వే అధికారులు మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు గురువారం మనుబోలు మండలం మడమనూరు వద్ద మట్టి పరీక్షలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతమున్న విజయవాడ-గూడూరు రైల్వే లైన్‌కు మూడు కి.మీ దూరంలోని భూమిలో 100 అడుగుల లోతు వరకు మట్టి, స్థితి కనుగొని ఆ నమూనాలను రైల్వే ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి!

- ట్రాఫిక్‌పై ప్రజల్లో అవగాహన కల్పించండి
- స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింట్ వేయండి
- అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

8 లో..

వ్యవసాయం, జీవనోపాధికి సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి అత్యవసరం

- వివరాలు 8లో..

ప్చ్...!

నామమాత్రంగా పేరెంట్, టీచర్ సమావేశాలు
అది కూడా నెలనెలాకాదు.. ఎప్పటికో!
విద్యా శాఖ అధికారుల చొరవ అంతంతే!

నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద ఉన్న కృషినగర్ జడ్పీ హైస్కూల్లో 400 మంది విద్యార్థులు ఉన్నారు.మూడు నెలలకొకసారి మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. పాఠశాల ఉనికిని తెలిపే బోర్డును కూడా మూలనపడేశారు. రెగ్యులర్ హెచ్‌ఎం లేక ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్ల కొరత ఉంది. తాగునీటి ప్లాంట్ పనిచేయడం లేదు. ఇలా ఎన్నో సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



తరగతి గదులు చాలకపోవడంతో చెట్లకింద విద్యార్థులు



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న శుద్ధిజల కేంద్రం


నెల్లూరు (విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ చేపట్టిన పీటీఎం కార్యక్రమం నామమాత్రంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు, పాఠశాల అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చి ఈ ఏడాది జులై 5వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 2.0) పేరుతో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 3,221 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. అది విజయవంతం కావడంతో క్రమం తప్పకుండా ప్రతీ నెలా పీటీఎం నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిల్లాలో మొక్కుబడి సమావేశాలే నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా చర్చించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు.

విద్యా ప్రమాణాల పెంపు ఏదీ..

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థుల ప్రవర్తన, అలవాట్లు, క్రమశిక్షణ వంటి అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని తప్పనిసరిగా నిర్వహించాల్సిన పీటీఎంను మొక్కుబడిగా మార్చేశారు. కొన్ని పాఠశాలల్లో అయితే ఈ సమావేశాలను మూడు నెలలకో లేదా వారికి తీరిక సమయం ఉన్నప్పుడో నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సమావేశాలను నిర్వహించాలన్న ఆలోచన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు లేకపోవడంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు కూడా మిన్నకుండిపోతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అన్ని పాఠశాలల్లో నిబంధనల ప్రకారం తల్లిదండ్రుల సమావేశాలను ప్రతినెలా కచ్చితంగా నిర్వహించాలని కోరుతున్నారు.

ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 339 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది జూలై 10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం జరిగింది. అప్పటి నుంచి ఒక్క సమావేశం కూడా జరగలేదు. మంచినీరు, తరగతి గదుల కొరత, ప్రహరీ నిర్మాణం ఇలా అనేక సమస్యలు ఈ పాఠశాలలో నెలకొని ఉన్నాయి

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



అల్లూరులోని ఆర్‌డీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉన్నారు. దాదాపు 8 నెలల క్రితం ఏర్పడిన పాఠశాల విద్యా కమిటీ సభ్యులు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఒక్కసారి మాత్రమే తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అప్పటినుంచి అతీగతీ లేదు. స్కూలులో వసతులు లేవు. కనీసం పిల్లలు తాగేందుకు నీరు కూడా లేదు. అసంపూర్తి భవనాలు, టీచర్ల కొరత ఉంది.

- అల్లూరు (ఆంధ్రజ్యోతి)



సంగ మండలం దువ్వూరు మెయిన్‌లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికైన తరువాత ఒకటీ రెండు సార్లు సమావేశాలు నిర్వహించినా మొక్కుబడిగానే సాగింది. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రస్తావన లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

అమీబిక్.. అప్రమత్తం!

- వైరస్ విస్తృతితో ప్రభుత్వం ఆదేశాలు
- జాగ్రత్తగా ఉండాలని అయ్యప్ప భక్తులకు సూచనలు
- పీహెచ్‌సీల వారీగా అవగాహన కార్యక్రమాలు



నెల్లూరు (వైద్యం) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమీబిక్ మెనింగో ఎన్సెఫాలిటిస్ (అమీబిక్ బ్రెయిన్ ఫీవర్) వైరస్ కేరళను వణికిస్తోంది. ఇప్పటికే ఈ వైరస్ బారిన 80 మంది పడగా, 19 మంది మృత్యువాత పడ్డారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై వైద్య ఆరోగ్య శాఖకు పలు ఆదేశాలు జారీ చేశాయి. ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు జాగ్రత్తలు తెలియజేయాలని సూచించాయి. జిల్లాలోని పలు ఆసుపత్రులతోపాటు నర్సింగ్ కళాశాలల్లో వేల సంఖ్యలో కేరళకు చెందిన విద్యార్థినులు నర్సింగ్ చదువుతున్నారు. అంతేగాక అయ్యప్ప భక్తులు కేరళకు వెళ్లి వస్తున్నారు. దీంతో జిల్లావాసులు ఎవరూ అమీబిక్ వైరస్ బారిన పడకుండా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలుషిత నీటి ద్వారానే వైరస్ వ్యాప్తి చెందుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శబరిమలలోని పంపానదిలో తలతో కూడా మునగ వద్దని కేరళ ప్రభుత్వం హెచ్చరిస్తుంది. ముక్కు ద్వారా అమీబిక్ వైరస్ మెదడుకు చేరుతుంది. వాంతులు, తల తిరగడం, తలనొప్పి, వాంతులు, జ్వరం, కంటి దృష్టిలో లోపం, మూర్ఛ తదితర లక్షణాలు బయటపడతాయని వైద్యులు తెలిపారు. ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చని చెబుతున్నారు. శబరిమలకు వచ్చే భక్తులు వేడిచేసిన నీరే తాగాలని, కాళ్లు, చేతులు శుభ్రం చేసుకున్నాకే భోజనం చేయాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదని కేరళ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వెళ్లే అయ్యప్ప భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

అయ్యప్ప భక్తులను హెచ్చరిస్తున్నాం!

కేరళలో వెలుగు చూసిన అమీబిక్ వైరస్‌పై ప్రభుత్వ నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా నుంచి అయ్యప్ప భక్తులు ఎక్కువ మంది శబరిమలకు వెళుతున్నారు. వారు ఆ వైరస్ బారిన పడకుండా ఉండాలని, ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాం. పీహెచ్‌సీ పరిధిలోని అయ్యప్ప భక్తులకు వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. నీటిలో ముక్కు వరకు మునగ వద్దని చెబుతున్నాం.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కేరళలో అమీబి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పంపా నదిలో పూర్తిగా మునగ కూడదు, ముక్కు ద్వారా వైరస్ మెదడులోకి చేరి మెదడును తినేసే ప్రమాదం ఉంటుంది. పరిశుభ్రంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కేరళ నుంచి వచ్చే భక్తులు, నర్సులు అనుమానితులు వైద్యుల సూచనలు పాటించాలి.

- డాక్టర్ బెన్‌హర్, జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ

సచివాలయాలకు ప్రత్యేకాధికారులు

- 36 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

నెల్లూరు (జడ్పీ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాలకు మండల స్థాయి ప్రత్యేకాధికారి ఏర్పాటు కానున్నారు. సచివాలయ వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు విస్తృత సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఇందుకోసం మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలను నియమించాలని నిర్ణయించింది. జిల్లాపరిషత్‌లోని సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీల్లోని గ్రేడ్-1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 20మంది జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్లకు, పంచాయతీ శాఖలోని 16మంది కార్యదర్శులకు పదోన్నతులు లభించాయి. వీరిని నెల్లూరుతో పాటు తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకూ కేటాయించారు. ఇకపై సచివాలయాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు కానుంది.



ఫైళ్లు ఎక్కడుండి!

కలెక్టరేట్ అధికారులను ప్రశ్నించిన ఆడిట్ బృందం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి నాలుగురోజుల క్రితం ఏజీ ఆడిట్ అధికారులు కలెక్టరేట్‌కు వచ్చి రికార్డులు ఇవ్వాలని సెక్షన్‌ల అధికారులను కోరారు. గన్ లైసెన్సు రిజిస్టర్, భూరికార్డులు కనిపించక పోవడంతో సెక్షన్ అధికారుల గొంతులో వెలక్కాయ పడినట్లైంది. ఆడిట్ అధికారులు రికార్డులను తనిఖీ చేసి, అందులోని ఖర్చుల బిల్లులు నిబంధనల ప్రకారం ఉన్నాయా? అక్రమాలు చోటు చేసుకున్నాయా...? అనే వివరాలతో నివేదిక తయారు చేస్తారు. ఆడిట్ బృందానికి ఏయే సెక్షన్‌ల్లో అక్రమాలకు అవకాశం ఉందో తెలుసు. అందుకే పలానా రికార్డులు కావాలని, పలానా రిజిస్టర్‌లు కావాలని అడుగుతారు. తొలుత కలెక్టర్, జేసీలను సంప్రదించిన తరువాత వారు ఫైళ్ల ఆడిట్‌కు ఉపక్రమించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఆడిట్ అధికారులు

నీళ్లు నమిలిన అధికారులు

విజయవాడ ఏజీ కార్యాలయం నుంచి సీనియర్ ఆడిట్ అధికారి ఎన్.బాలాజీసింగ్, ఆడిట్ అధికారులు రాకేష్, సౌమిక్ రికార్డులు ఆడిట్ చేయడానికి వచ్చారు. కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్‌లు ఉన్నాయి. గన్‌లైసెన్స్‌కు సంబంధించి ఒక సెక్షన్ ఉంది. సెక్షన్‌లకు సంబంధించి రిజిస్టర్లను, ఫైళ్లను ఆడిట్ కోసం ఇవ్వాలని ఆడిట్ అధికారులు అడగ్గా, సంబంధిత సెక్షన్ హెడ్‌లు ఆడిట్ అధికారులకు సమాధానం ఇవ్వలేదని తెలిసింది. 2017కు ముందు గన్‌లైసెన్స్‌ల రికార్డులను సమర్పించాలని ఆడిట్ అధికారులు అడగ్గా, ఇంతవరకు ఆ రికార్డులను వారికి సమర్పించలేదు. ఆ రికార్డులు అసలు ఉన్నాయా? మాయం అయ్యా యా... అనే విషయాన్ని ఉన్నతాధికారులు తేల్చాలి. 2017కు ముందు రికార్డుల వివరాలు మాన్యువల్‌గా ఉండేవి. ఆ తరువాత కంప్యూటరీకరణ జరిగింది. 2017కు ముందు భూసంబంధ, గన్ లైసెన్స్ రిజిస్టర్లలో చాలా వ్యవహారం నడించిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఇస్తారా... లేదా..?

కాగా ఈనెల 16న ఆడిట్ అధికారులు కలెక్టరేట్‌కు వచ్చారు. వచ్చిన నాటి నుంచి రికార్డులు ఇవ్వాలని అడగ్గా, ఇవ్వలేదని తెలిసింది. ఈ నెల 27తో వారి ఆడిట్ ముగుస్తుంది. అప్పటికైనా రికార్డులను అధికారులు ఇస్తారో, కాలయాపన చేస్తారో వేచి చూడాలి. ఆడిట్ అధికారులు మాత్రం తాము పాలనా రికార్డులు కావాలని అడిగామని, ఇచ్చినప్పుడే వాటిని ఆడిట్ చేస్తామని చెప్పారు.

పంచాయతీల్లో రేపు గ్రామసభలు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయం నుంచి ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ గ్రామ సభలకు ఉపాధి హామీ కూలీలు హాజరై కొత్త జాబ్‌కార్డులకు, పని కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈకేవైసీ సమస్య వల్ల రద్దయిన జాబ్‌కార్డులను పరిశీలించి, శ్రామికులకు ఈకేవైసీ చేయించి, గ్రామసభల్లో జాబ్‌కార్డులు అందించాలన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

మనుబోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు అవసరమైన క్రీడాసామగ్రిని మనుబోలు నీటిసంఘం అధ్యక్షుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి అందజేశారు. గురువారం రామిరెడ్డి పుట్టినరోజు వేడుకలను త్రిబుల్ ఆర్ టీమ్ రెండు పాఠశాలల్లో నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అమూల్యకుమారి, వసంతకుమారిలు క్రీడాసామగ్రి దాతకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పిల్లలకు రామిరెడ్డి కేక్‌లు, మిఠాయిలు పంచిపెట్టారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11740
వెండి కిలో ధర	రూ. 159600
వెండి ఒక గ్రాము	రూ. 164.60

మండల విద్యాశాఖాధికారికి సన్మానం



ఎంఈవో చెంచులక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండల విద్యాశాఖాధికారిణి చెంచులక్ష్మిని ఘనంగా సన్మానించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఎంఈవో చెంచులక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడాన్ని అలవరచుకోవాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి, ఉపాధ్యాయినిలు సులోచన చంద్రకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చలానాలు కడితేనే డివైడర్లపై ఫ్లెక్సీలకు అనుమతి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని జాతీయ రహదారి వెంబడి, తదితర ప్రాంతాల్లోని డివైడర్లపై ఫ్లెక్సీల ఏర్పాటుకు మున్సిపాలిటీకి చలానాలు కడితేనే అనుమతి ఇస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమిషనర్ బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమాశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో చలానా కట్టకుండా డివైడర్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కమిషనర్ భారీగా జరిమానాలు విధిస్తారని హెచ్చరించారు. మున్సిపాలిటీలోని ప్రజలు ఈ నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన 12 అజెండాలను ఏకగ్రీవంగా ఆమోదించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులుపాల్గొన్నారు.

ఆ ఏటీఎంలోనగదు డిపాజిట్ చేస్తే అంతే!

పొదలకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌రోడ్డుపై గల బ్యాంకు ఏటీఎం డిపాజిట్ మిషన్ సాంకేతిక కారణాల వల్ల సక్రమంగా పనిచేయడం లేదు. రెండురోజుల క్రితం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అత్యవసర పరిస్థితులలో రూ. 50వేల నగదును ఈ ఏటీఎం ద్వారా డిపాజిట్ చేసేందుకు వెళ్ళాడు. డిపాజిట్ ఆప్షన్ నొక్కాడు. డబ్బులు పెట్టిన కొన్ని సెకన్లకే మిషన్‌డోర్ వెంటనే లాక్ అయింది. ఈ విషయమై మేనేజర్ వివరణ ఇస్తూ.. ఏటీఎంలో డిపాజిట్ నగదుకు సాంకేతిక కారణాల వల్ల ఏదైనా జరిగితే తామేమి చేయలేమన్నారు. బ్యాంకు హెడ్ క్వార్టర్ నుండే నగదు అకౌంట్‌లో జమచేస్తారన్నారు.

కండలేరులో నీటి నిల్వ 57.97 టీఎంసీలు

రాపూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.97 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 550 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 980 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

సురేష్‌రెడ్డికి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డు

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అజ్ఞాత రక్తదాత స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డును జిల్లాలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన కోవూరుకు చెందిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డికి అందచేశారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆ అవార్డును మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సురేష్‌రెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలిరెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే. హరినారపరెడ్డి పాల్గొన్నారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తుకు 30 వరకు గడువు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల కోసం 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ ద్వారా పక్కా గృహాల మంజూరు కోసం లబ్ధిదారులు తమ పేర్లు సచివాలయాల్లో కేటాయించిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

పచ్చిరొట్ట పైర్లతో భూముల సారవంతం!

● పంటలకు 80 శాతం నత్రజని

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల సారవంతం కోసం ప్రధాన పంటల సాగుకు 45 రోజుల ముందు నుంచి రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తారు. దీంతో భూములు సారవంతంగా మారి అధిక దిగుబడులు రావడంతో పాటు కొంతమేర పెట్టుబడులు తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. మండలంలో ఇప్పటికే పచ్చిరొట్ట పైర్లు (జీలుగ, జనుము, పిల్లిపెసర) సాగు చేసిన రైతులు ప్రధాన వరి నాట్లు దగ్గర పడుతుండడంతో పచ్చిరొట్టపైర్లతో దుక్కులు చేస్తున్నారు. రసాయన ఎరువులతో వ్యవసాయ భూములు విషతుల్యం కాకుండా ఉండేందుకు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట (జీలుగ, జనుము, పిల్లిపెసర) విత్తనాలను 50శాతం రాయితీతో పంపిణీ చేసింది. ఈ మేరకు మండలంలో రబీ సీజన్ కోసం 28 టన్నులు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీతో రైతులకు పంపిణీ చేశారు.

పచ్చిరొట్ట ఎరువులతో పుష్కలంగా నత్రజని

సేంద్రియ ఎరువులు కింద సాగుచేసే పచ్చిరొట్ట పైర్లు భూమిలో పెరుగుతున్న దశలో ఆ మొక్కలకు ఉండే వేర్లు వాతావరణంలోని నత్రజనిని అందుపుచ్చుకుని 80 శాతం నత్రజనితో బుడిపెలుగా తయారవుతాయి. పచ్చిరొట్ట పైరును 40నుంచి 45 రోజుల వ్యవధిలో బురద దుక్కులు చేసి 10నుంచి 15రోజులపాటు కుళ్లబెట్టి ఆ తరువాత వరినాట్లు వేయాలి. వరినాటినప్పటి నుంచి పంట కోత దశకు వచ్చే వరకు ప్రధాన వరి పంటకు ఇవి నత్రజనిని పుష్కలంగా అందిస్తాయి. దీంతో యూరియా వంటి ఎరువుల వాడకాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసిన భూముల్లో పలువురు రైతులు రసాయన ఎరువులు వాడకపోయినా అధిక దిగుబడులు పొందుతుంటారు.

- ఎన్. శ్రీహరి, మండల వ్యవసాయాధికారి, బుచ్చిరెడ్డిపాళెం





వరినాట్ల కోసం పచ్చిరొట్టపైరు జీలుగను బురద దుక్కి చేస్తున్న రైతు, జీలుగ మొక్క వేర్లలో నత్రజనితో నిండి ఉన్న బుడిపెలు



నేలటూరు పునరావాసానికి రూ.10 కోట్లు

ముత్తుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో నేలటూరు పునరావాసానికి నిధులు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. గురువారం ముత్తుకూరు టీడీపీ కార్యాలయంలో మండల తెలుగుయువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ శాఖామంత్రి, జెన్‌కో ఎండీతో ఎమ్మెల్యే మాట్లాడి రూ.10.5కోట్లను పునరావాసం కోసం మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వరయ్య, వావిళ్ళ జనార్ధన్, రవి, కొండూరు విజయ్, యాదగిరి, రవీంద్ర పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదాతలకు సన్మానం

పొదలకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో గురువారం శబరిమల అయప్పసేవా సమాజం సభ్యులు కార్తీక మాసం సందర్భంగా మాలధారణ చేసిన వారికి అన్నసంతర్పణ చేసిన ఉభయకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమాజం ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శబరిమల వెళ్లే స్వాములకు పలు సూచనలు చేసి, శబరిమలలో సమాజం తరఫున అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమాజం జిల్లా అధ్యక్షుడు వి రాజా, పొదలకూరు మండల అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న అయ్యప్ప సేవా సమాజం సభ్యులు

భావనారుషీశ్వరుడికి అన్నాభిషేకం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని పాతకాశీపాళెంలో కొలువైవున్న భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామికి గురువారం కార్తీక మాసం ఆఖరిరోజు అమావశ్య సందర్భంగా (అన్నంతో శివలింగం) అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో మూలవరులకు పూజలు నిర్వహించి అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదికపైన కొలువుదీర్చి పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో అన్నాభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మిట్టదొడ్ల సురేంద్రబాబు, సభ్యులు పోలిశెట్టి నరసయ్య, చేపూరు చలమయ్య, మామిళ్ల మల్లికార్జున, అందె చిన్నబ్బయ్య, కాసుల జనార్దన్, అండగుండ సుబ్బారావు పాల్గొన్నారు.



వేదికపైన కొలువుదీరిన భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామిని దర్శించుకుంటున్న కమిటీ చైర్మన్, సభ్యులు

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ ఎస్‌డీసీ), జాతీయ నైపుణాభివృద్ధి సంస్థ (ఎన్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరు ద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఆపై చదివిన యువతీ, యువకులకు పర్చేజ్ అసిస్టెంట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ కమ్మోడిటీ, కస్టమర్ కేర్ సర్వీసు ఎగ్జిక్యూటివ్ కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారికి సర్టి ఫికేట్ అందించి ఉద్యోగావకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్

ఉలవపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్లూరు, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు సముద్ర తీర ప్రాంతంలో గురువారం సాగర్ కవచ్ నిర్వహించినట్లు మెరైన్ సీఐ జీ శివన్నారాయణ తెలిపారు. సాగర్ కవచ్‌లో భాగంగా కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్(మాక్ డ్రిల్)లో ఇండయన్ కోస్ట్ గార్డు, ఇండియన్ నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఇంటలిజెన్స్, మత్స్య శాఖ, వివిధ భద్రతా విభాగాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ మాక్ డ్రిల్ శుక్రవారం కూడా కొనసాగుతుందని చెప్పారు. బ్లూ ఫోర్స్, రెడ్ ఫోర్స్ అనే రెండు విభాగాలుగా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోస్టల్ సెక్యూరిటీ యంత్రాంగం యొక్క ప్రభావం, సామర్థ్యంను తనిఖీ చేయడానికి దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నెల్లూరు ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఒంగోలు నోడల్ అధికారి డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వీవీపాలెం, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు ఎస్‌ఐలు మరిదినాయుడు, కే.అంకమ్మ, బీ.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు బందోబస్తు నిర్వహించిన వారిలో ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీస్ అధికారులు

ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కావలి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిష్ణాపురం నవోదయ పాఠశాల విద్యార్థిని కత్తి ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వివిధ గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు పేర్కొన్నారు. పట్టణంలోని అడవిరాజుపాలెంలో గురువారం జరిగిన ప్రణీత అంత్యక్రియల్లో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బ్రహ్మయ్య, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హజరత్, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, రాపూరి క్రిష్టయ్య, విద్యారంగం పోరాటసాధన కమిటీ కన్వీనర్ శ్యామల తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. మృతురాలి తండ్రి ఎంఈవో రవికుమార్, కుటుంబ సభ్యులతో రామర్శించారు. ఈ మృతిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. రాష్ట్ర మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ సంఘటనపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చదువు చెప్పిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలు ఉన్నత పాఠశాలలో 1970-75 మధ్య కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈసందర్భంగా అప్పటి గణిత ఉపాధ్యాయుడు గమిడి వెంకటసుబ్బయ్యను, ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. అలాగే తాము చదువుకున్న పాఠశాలలో ప్రస్తుత విద్యార్థుల కోసం డైనింగ్ హాలు, సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు పీఏసీఎస్ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసినట్లు స్థానిక లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ తెలిపారు. వారంరోజుల పాటు విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అందులో విజేతలైన వారికి చివరిరోజున బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమూల్యకుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న లైబ్రేరియన్ అరుణ్‌కుమార్

కృష్ణపట్నం సొసైటీకి అవార్డు

ముత్తుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి డివిజనల్ స్థాయి అవార్డు దక్కింది. కృష్ణపట్నం సొసైటీ రైతుల సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. గురువారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు సొసైటీ చైర్మన్‌గా తన బాధ్యతను మరింత పెంచిందని, రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని అవార్డు గ్రహీత రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటాద్రి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి : ఏఈ

ముత్తుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని ఏఈ ఎస్‌కే అక్బర్ తెలిపారు. ముత్తుకూరు సబ్‌స్టేషన్‌లో గురువారం నూతనంగా ఏర్పాటుచేసిన బ్రేకర్‌ను ప్రారంభించారు. ఏడీఈ రాము ఆధ్వర్యంలో మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐ మురళీకృష్ణారెడి, జేఎల్‌ఎం నాగరాజు, సిబ్బంది రహీమ్ పాల్గొన్నారు.



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ అక్బర్

ముగిసిన కార్తీక మాసోత్సవాలు

రాపూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ముగింపు పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు పర్వతవర్ధిని రామనాథేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు, అభిషేకాలు జరిగాయి. గురువారం వేకువజామునే మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయం ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అలాగే ఆడమారు మఠం (ఉడిపీ) పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామీజీ రాపూరు శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోసంరక్షణ కోసం యాత్రకు సంకల్పించామని తెలిపారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఈషా ప్రియ తీర్థ స్వామీజీ

మెగా రక్తదానం, అన్నదానం

కావలి(టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి 44వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఏరియా వైద్యశాల ప్రాంగణంలో మెగా రక్తదానం, అన్నదానం నిర్వహించారు ముందుగా కాంటంరెడ్డి ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించి ఆయనతో పాటు ఆయన సతీమణి శివప్రియలు స్వయంగా రక్తదానం చేశారు. రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోసల గోపాలరెడ్డి, బాలకృష్ణంరాజు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు రుద్రాభిషేక పూజలు

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వెలసి ఉన్న జ్ఞాన ప్రసున్నాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం కార్తీక మాస రుద్రాభిషేక పూజలు జరిగాయి.

C.R.I.M.E N.E.W.S

రైల్లో నుంచి పడి ప్రయాణికుడి మృతి

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 3లో కాకినాడకు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికుడు రేకాడి నూకరాజు(55) బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. కావలి జీఆర్పీ ఎస్‌ఐ వెంకటరావు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ఈస్ట్‌గోదావరి జిల్లా ఐ పోలవరం మండలం టీ కొత్తపల్లికి చెందిన రేకాడి నూకరాజు చెన్నై నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరాడు. రైలు బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆగే సమయంలో డోర్ వద్ద నిలుచుని ఉండగా ప్రమాదవశాత్తు జారి రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య పడి మృతి చెందాడు. ఈ సంఘటనతో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ ఎస్‌ఐ వెంకటరావు గురువారం తెలిపారు.

గువ్వాడి గ్రామంలో చోరీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యాదిగిరి చినగురుస్వామి నివాసంలోకి అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న దుస్తులు, ఇతరత్రా వస్తువుల చోరీకి పాల్పడ్డారు. ఈవిషయమై గురుస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు నివాసాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



బీరువాలో దుస్తులను కింద పడేసిన దొంగలు

అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వింజమూరు పట్టణానికి చెందిన యువకుడు సాధిఖ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ఎన్ వెంకటరావు తెలిపారు. ఈమేరకు అతన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య వచ్చేనెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించారన్నారు. దీంతో అతన్ని జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

మద్యం మత్తులోనే స్నేహితుడి హత్య!

● రూ.500 విషయమై ఘర్షణ

● అనుమానాస్పద మృతిని ఛేదించిన పోలీసులు

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యువకుడి అనుమానాస్పద మృతిని పోలీసులు ఛేదించారు. రూ.500 విషయమై ఏర్పడిన వివాదం చినికి చినికి పెద్దదై మద్యం మత్తులో స్నేహితుడి హత్యకు దారితీసిన ఈ ఘటన కోవూరులో గత నెలలో జరిగింది. సీఐ సుధాకరరెడ్డి కథనం మేరకు.. కోవూరు మండలం పడుగుపాడు సాలుచింతల మసీదు వీధి ప్రాంతానికి చెందిన షాజహాన్‌కు అదే ప్రాంతానికి చెందిన చేజర్ల రాజా అలియాస్ కుక్కల రాజా, పోతిరెడ్డిపాళేనికి చెందిన షేక్ మస్తాన్‌వలి, నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీకి చెందిన జ్యోతి చిన్న అలియాస్ సుబ్బయ్య, పోతిరెడ్డిపాళెం శ్రీవాణి కాలనీకి చెందిన యద్దల పెంచలయ్య స్నేహితులు. ఈ ఐదుగురు కలిసి తరచూ ఆటోలో తిరుగుతూ మద్యం సేవించేవారు. గత నెల 25న సాలుచింతల కూడలిలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి పక్కనే అరటికాయలు నిలువ చేసే గోదాములో మద్యం సేవించారు. రాజా-మస్తాన్‌వలి మధ్య రూ.500ల విషయమై ఘర్షణ తలెత్తింది. ఇద్దరి మధ్య తలెత్తిన ఘర్షణను షాజహాన్ నివారించాడు. ఈ క్రమంలో షాజహాన్ పెదవిపై గాయమైంది. వెంటనే కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని పెదవికి వైద్యసహాయం పొందాడు. స్థానిక బజారుకూడలిలోని ఓ మద్యం దుకాణంలో తిరిగి రెండో పర్యాయం మద్యం కొనుగోలు చేసి సేవించాడు. తనపెదవిపై గాయం చేశారనే ఆగ్రహంతో షాజహాన్ బ్లేడుతో రాజా శరీరంపై దాడి చేశాడు. దీంతో కోపోద్రిక్తులైన రాజ, మస్తాన్‌వలి మద్యం మత్తులో షాజహాన్ తలను సిమెంటు దిమ్మెకు ఆనించి కొట్టారు. సిమెంటు దిమ్మెకు తల బలంగా తగలడంతో షాజహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఘటనాస్థలం నుంచి పెంచలయ్య, సుబ్బయ్య పారిపోయారు. షాజహాన్ మృతదేహాన్ని రాజా, మస్తాన్‌వలి ఆటోలో వేసుకుని లక్ష్మీనారాయణపురం సమీపంలోని వేగూరు కాలువలో తొక్కేసి వెళ్లారు. నాలుగు రోజుల తరువాత శవం తేలియాడుతూ కన్పిస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు మృతదేహం గురించి ఆరాతీసినప్పటికీ గుర్తించలేకపోయారు. పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఖననం చేశారు. ఈనెల 16న తన తమ్ముడు అదృశ్యమయ్యాడని మస్తాన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహం ఫొటోలు, దుస్తులు చూపెట్టడంతో షాజహాన్‌గా గుర్తించారు. దీంతో అతని స్నేహితులపై దృష్టి సారించిన సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌ఐ ముత్యాలరావు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెలుగ చూశాయి. హత్యానేరాన్ని వెలికితీసిన పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.



షాజహాన్ (ఫైల్)

డిఫెన్స్ మద్యం సీసాల స్వాధీనం

● బాటిల్‌పై రూ.1000 అధికంగా విక్రయం

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అతనో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. అతని క్యాంటీన్ కార్డుతోపాటు మరి కొందరి కార్డుల ద్వారా డిఫెన్స్ మద్యం కొనుగోలు చేసి ధరలకు విక్రయించడం ప్రారంభించాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు పథకం ప్రకారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని బీవీనగర్ బ్యాంకు కాలనీకి చెందిన బసివిరెడ్డి జగదీశ్వరరెడ్డి డిఫెన్స్ మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు మధ్యవర్తులను పంపి మద్యం కావాలని అడిగించారు. జగదీశ్వరరెడ్డి బాటిల్ ఎమ్మార్పీపై రూ.1000 అధికంగా తీసుకొని మద్యం విక్రయిస్తుండగా బుధవారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 750 ఎంఎల్ 12 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. విచారించగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఎస్‌ఐ డీ శ్రీధర్ గురువారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

18 కిలోల గంజాయి పట్టివేత

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇనమడుగు రోడ్డు కూడలిలో గురువారం ఎక్సైయిజ్ పోలీసులు ఓ మహిళ నుంచి 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైయిజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా తమిళనాడు రాష్టం మదురై పట్టణానికి చెందిన తిరుపతి మణిమేఘలై సూట్‌కేసులో గంజాయి తీసుకువెళ్త పట్టుబడింది. ఒడిశాలోని రాయగడలో గంజాయి కొనుగోలు చేశాడు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 660

మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి


నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు ఉద్యకారుల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని విచారించాలని ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి ఆర్ శివశంకర్ ఓ ప్రకటనలో కోరారు. ఎన్‌కౌంట ర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. మావోయిస్టులను అంతం చేస్తామని బహిరంగంగా ప్రకటించి నరమేధానికి పాల్పడటం రాజ్యాంగాన్ని ఆపహాస్యం చేయటమేనని తెలిపారు. మావోయిస్టు పార్టీ దేశంలో దోపిడీ, పీడన నుంచి పుట్టిందని, ఆ పార్టీ నాయకులు హిడ్మా, నంబాళ్ల కేశవరావు తదితరులను పట్టుకొచ్చి కాల్చి చంపడాన్ని ఓపీడీఆర్ ఖండిస్తోందని పేర్కొన్నారు.

ప్రకాశం ఏపీసీగా అనిల్ కుమార్

నెల్లూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకుడు దాసరి అనిల్ కుమార్ ప్రకాశం జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. గురువారం రాష్ట్రంలోని 8 జిల్లాలకు జరిగిన ఏపీసీల నియామకంలో భాగంగా అనిల్‌కుమార్‌ను ప్రకాశం జిల్లాకు కేటాయించారు. ఏడాదిపాటు ఈ పోస్టులో ఉంటారని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రైల్వేస్టేషన్ పడమర ద్వారం వద్ద ట్రాఫిక్‌జామ్, పక్కన అసంపూర్తిగా ప్రధాన భవనం



1వ నెంబరు ప్లాట్‌ఫాంపై పూర్తికాని పనులు



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఎన్నేళ్లు.... ఇంకెన్నాళ్లు!

- నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పూర్తిగా నిలిచిపోయిన పునరాభివృద్ధి పనులు
- కాంట్రాక్టర్ల మధ్య తారస్థాయికి విభేదాలు?
- నిత్యం ప్రయాణికులకు అవస్థలు
- పట్టించుకోని రైల్వే ఉన్నతాధికారులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు రెండు నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్ట్ పనులు దక్కించుకొన్ని సంస్థకు సబ్ కాంట్రాక్టర్లకు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో పనులు నిలిపివేశారని సమాచారం. ఈ పరిణామాలతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయి, వస్తువులు ఎక్కడపడితే అక్కడ ఉండటంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయడు కృషితో 2019లో కేంద్ర ప్రభుత్వం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధికి పునరాభివృద్ధి పథకం కింద రూ.102కోట్లు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్‌జీఆర్ఎల్, ఫేస్ సంస్థలకు ఈ పనులు అప్పగించారు. తూర్పు,పడమర వైపుల నిర్మించాల్సిన ప్రధాన భవనాల నిర్మాణం మాత్రమే అవి చేస్తూ మిగతా ఎలక్ట్రికల్, ఫైర్ ఫిట్టింగ్, ఏసీలు, వెంటిలేషన్, సిగ్నలింగ్, కోర్టు భవనం, ఎస్‌టీపీ ప్లాంట్, సోలార్, బీఎంఎస్ పనులు... వంటివి సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించాయి. 2022లో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు నత్తనడకన 50శాతం మేర పూర్తిచేశారు. ఆ తర్వాత విభేదాలతో పూర్తిగా నిలిపేశారు. ఫలితంగా ఎక్కడి పనులు అక్కడే ఉండిపోవడంతో ప్రమాదకర విద్యుత్ తీగలు, గుంతల రోడ్డు, బారికేడ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. అయినా, రైల్వే ఇంజనీర్లుగానీ, ఉన్నతాధికారులుగానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. గతేడాది మే నాటి కే పూర్తి చేయాల్సిన పనులు ఇప్పటికీ 50 శాతంలోపే కావడం గమనా ర్హం. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి... నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

ఆకాశదీపానికి ఉద్వాసన

- ముగిసిన కార్తీక మాసోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆలయాల్లో కార్తీక మాసోత్సవాలు గురువారం ముగిశాయి. అన్నీ శైవ క్షేత్రాల్లో విశేష పూజలు జరిపి ఆకాశ దీపాలకు ఉద్వాసన పలికారు. పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, సహస్రనామ పూజలు నిర్వహించారు. ఈ మాసంలో జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శివ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. గణేష్ ఘాట్, వీఆర్సీ మైదానంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కాగా, కార్తీక మాసం ముగింపు సందర్భంగా పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం నయనానందకరంగా జరిగింది.



పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో శివపార్వతుల కల్యాణం



గణేష్ ఘాట్ వద్ద స్వర్ణాల చెరువులో కార్తీక దీపాన్ని వదులుతున్న భక్తుడు



టీడీపీలోకి నాయకులను ఆహ్వానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం!

- ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేసేందుకు ప్రజలందరు కలిసికట్టుగా ముందుకురావాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో సౌత్ మోపూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలను టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేస్తూ అభివృద్ధి ఫలాలను ప్రతీ కుటుంబానికి చేరవేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాపూరు చంద్రశేఖర్, గుండ్లపాళెం సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, నాయకులు జలదంకి సుధాకర్, గుంజి రవి, పెళ్లూరు రవీంద్ర, సాదేపల్లి విజయ్‌భరత్, చీమల సుధాకర్, ఆరెద్దుల మణి పాల్గొన్నారు.

29 పార్కు స్థలాలకు గోడలు

నియోజకవర్గంలో రూ.వందల కోట్లు విలువ చేసే 29 పార్కుల స్థలా లకు రూ.8కోట్లతో రక్షణ గోడలు నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయా స్థలాల్లో రెండో దశలో లైటింగ్, మూడో దశలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు అందజేస్తామని చెప్పారు.

ఇంకా రూ.35 కోట్లు వసులు చేయాలి

- ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కొళాయి పన్ను రూ.35 కోట్లు వసూలు చేసి తీరాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంపై ఆయన సమీక్ష జరిపారు. పన్ను డిమాండ్ రూ. 41 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు రూ. 6 కోట్లు మాత్రమే వసూలు చేశారని, మిగిలిన రూ.35 కోట్లు రానున్న ఐదు నెలల్లో వసూలు చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఒక్క అనధికార కొళాయి కూడా ఉండటానికి వీల్లేదని హెచ్చరించారు. పైగా రూ.5 వేలు కొళాయి పన్ను ఉండే యజమానులకు నోటీసులు జారీ చేయాలని, వారందరినీ డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో హాజరుపరచాలని సూచించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

స్మార్ట్ స్ట్రీట్ బజారు పరిశీలన

నగరంలోని మైపాడు గేట్ వద్దనున్న స్మార్ట్ స్ట్రీట్ బజారును గురువారం కార్పొరేషన్ అధికారులు పరిశీలించారు. కమిషనర్ నందన్‌తో పాటు సిటీ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. ఇక్కడ షాపులను అనుసంధానిస్తూ పాదచారులకు మార్గం రూపొందించాలని కమిషనర్ సూచించారు. మరిన్ని సౌకర్యాలు కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముందుగా కోడూరుపాడు, పెద్దచెరుకూరు ప్రాంతాలలో లేఅవుట్లను పరిశీలించి అక్కడ ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

- కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఆ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ శ్రీనివాసులు, అల్లాడి గోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్మికులు నగరంలోని గాంధీబొమ్మ నుంచి సంక్షేమ బోర్డు వరకు ప్రదర్శన నిర్వహించి, కార్మిక సంక్షేమ బోర్డు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు పథకాలు అమలు చేయలేదని ఆరోపించారు. పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని కోరారు. 60 ఏళ్ల నిండిన కార్మికులకు రూ.6వేలు పింఛను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చాన్‌బాషా, సూర్యనారాయణ, ఆవుల పెంచలయ్య, ఖలీల్, నజీర్, సంపూర్ణమ్మ, హరి, తుమ్మల శ్రీనివాసులు, చిరంజీవి, బాలరాజు పాల్గొన్నారు.



కార్మిక శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

- మాజీ ఎమ్మెల్సీ బూదాటి జిల్లా గ్రంథాలయానికి పుస్తకాల వితరణ
- పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయానికి మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య గురువారం 50 పుస్తకాలను వితరణ చేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయానికి అందిస్తానని కేడ్రాయ్ చైర్మన్ రామకృష్ణ హామీ ఇచ్చారు. జిల్లాలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారిద్దరు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కాగా, వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ప్రజా సైన్సు వేదిక అధ్యక్షుడు సతీష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, గ్రంథ పాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు, అధికారులు

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

- ఎనిమిది మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మొబైళ్లు, నగదు వివరాలు తెలుపుతున్న సీఐ కల్యాణరాజు

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఓ లాడ్జిలో నిర్వహి స్తున్న పేకాట కేంద్రంపై దర్గామి ట్ట పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాడు తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.56,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు విలేకర్లకు వెల్లడించారు. సదరన్ సూట్స్ గెస్ట్ ఇన్ లాడ్జిలోని ఐదవ అంతస్తులో పేకాట నిర్వహి స్తున్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. గూడూరుకు చెందిన ఏ శ్రీనివాసులు, తలుపూరుకు చెందిన బీ దామోదర్, కోవూరు పల్లికి ,చెందిన ఎస్ సునీల్‌కుమార్, ఒంగోలు కొత్తపట్నం బస్టాండుకు చెందిన ఎన్ సుబ్రహ్మణ్యం, టంగుటూరుకు చెందిన ఆర్ సతీష్‌బాబు, నెల్లూరు ప్రకాష్‌నగర్‌కు చెందిన టీ ఆనందకుమార్, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎం వేణును అరెస్ట్ చేశామని తెలిపారు.

రెండు బిర్యానీ దుకాణాల సీజ్

నెల్లూరు(సిటీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లాకోర్టు ఎదురుగా ఉన్న రెండు బిర్యానీ తయారీ దుకాణాలను గురువారం సీజ్ చేసినట్లు మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కనకాద్రి తెలిపారు. ఈ దుకాణాల్లో తయారు చేసే బిర్యానీ ఘాటైన వాసన, గ్యాస్‌తో కూడి ఉండటం వల్ల న్యాయవాదులు, కక్షదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. బిర్యానీ బయట తయారు చేసుకుని ఇక్కడ అమ్మకాలు చేయాలని ఇప్పటికే రెండు దఫాలుగా నోటీసులు జారీ చేసినా తయారీదారులు పాటించకపోవడంతో ప్రత్యక్ష చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

జాతీయ రోలర్ హాకీ పోటీలకు ఆద్విక్

నెల్లూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో డిసెంబరు 5 నుంచి ప్రారంభమయ్యే జాతీయ రోలర్ హాకీ పోటీలకు నగరంలోని ఆంబర్‌ఉడ్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న పోలు ఆద్విక్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జూనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించాడని సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర మోడల్‌గా నెల్లూరు సిటీ నియోజకవర్గం

నెల్లూరు (వైద్యం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే మో డల్ సిటీగా నెల్లూరు నగర నియోజకవర్గాన్ని పురపాలక శాఖ మంత్రి పొంగూ రు నారాయణ అభివృద్ధి చేస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధ తెలిపారు. గురువారం నగరంలోని 42వ డివిజన్‌లో కాలువ పూడికతీత పనులు జరిగాయి. వాటిని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ మంత్రి ముందు జాగ్రత్త హెచ్చరికలతోనే కాలువ ల్లో మురుగునీరు సాఫీగా వెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువు రు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అనురాధ

కార్మికుల సంక్షేమమే కర్తవ్యం

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే తమ ప్రథమ కర్తవ్యమని బీజేపీ నాయకుడు, ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. జోనల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సరకాలం ముగిసిన సందర్భంగా ఆయన నగరంలోని ఓ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల ఆరోగ్యం కోసం జిల్లా వ్యాప్తంగా మూడు నెలలకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. ప్రమాదాల్లో గాయపడిన ఉద్యోగులకు అత్యవసర సహా యంగా ఈ ఏడాది కాలంలో రూ.2.90 లక్షలు అందించామన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి బెనిఫిట్స్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అధ్వానంగా ఉన్న ఆర్టీసీ నెల్లూరు ప్రధాన బస్టాండును పూర్తిగా పునరుద్ధరించి స్వచ్ఛ భారత్ అవార్డు అందుకునేలా మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధికారులు శేషగిరిరావు, ప్రభాకర్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేషన్‌రెడ్డి

మాజీ మంత్రి జోగితో వైసీపీ నాయకుల ములాఖత్

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఎమ్మెల్సీలు అరుణ్ కుమార్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ గురువారం ములాఖత్ అయ్యారు. తప్పు చేయని జోగి రమేష్ త్వరలోనే బయటకు వస్తారన్నారు. జగన్మోహన్‌రెడ్డితో కలిసి పోరాడే క్రమంలో ఇలాంటి అక్రమ కేసులు ఎన్నింటినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు రమేష్ చెప్పారన్నారు.



జైలు ముందు వైసీపీ నాయకులు

కళాకారులు కళను అమ్ముకుంటున్నారు!

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు20(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఉన్నత స్థాయిలో ఉన్న కొంతమంది కళను నమ్ముకోకుండా... అమ్ముకుంటున్నారని కళాంజలి శ్రీనివాస్, డాన్స్ మాస్టర్ డాక్టర్ నారాయణమూర్తి ఆరోపించారు. గురువారం జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా కళలకు ఎనలేని కీర్తిప్రతిష్ఠలున్నాయన్నారు. కానీ, కొంత మంది ఆర్కెస్ట్రా ముసుగులో ఈవెంట్ల పేరుతో కళను వ్యాపారంగా మార్చి జిల్లాకు చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో మహిళా కళాకారులను తీసుకొచ్చి అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారన్నారు. ఇలాంటి వారి వల్ల కళనే నమ్ముకున్న సంగీత, నాట్య కళాకారులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. రికార్డింగ డాన్సులు ప్రోత్సహించవద్దని జిల్లావాసులను కోరారు. దీనిపై ఎస్పీ దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాన్స్‌మాస్టర్ శామ్యూల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కళాకారులు

క్షయ నివారణకు సమష్టిగా కృషి చేయాలి

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు సమష్టి కృషి అవసరమని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 మంది క్షయ రోగులకు 15 రకాల పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. క్షయ నివారణకు మందులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే మందులతోపాటు తమ ట్రస్ట్ అందించే పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, మధు, వేణుగోపాల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భార్య, అత్తపై దాడి.. పోలీసు కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై దాడిచేసిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమా చారం మేరకు... నగరంలోని మూలాపేటలో సురేఖ, శ్రీనివాసులు దంపతులు నివసిస్తున్నారు. మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన శ్రీనివాసులు భార్య, పిల్లలను పట్టించుకోవడం మానేశాడు. దీంతో ఆమె ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 16వ తేదీన శ్రీనివాసులు భార్య వద్దకు వెళ్లి ఆమెతో, అత్తతో గొడవపడి ఇద్దరిపై దాడి చేశాడు. బాధితురాలు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని మృతిపై లోతుగా విచారణ

మర్రిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం మృతి చెందిన ప్రణీత ఘటనపై నవోదయ విద్యాలయ సమితి అధికారులు గురువారం లోతైన విచారణ నిర్వహించారు. విద్యార్థినిది హత్యగా అనుమానించి తండ్రి రవి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ దిశగా హైదరాబాద్ నుంచి వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, కర్నూలు నవోదయ ప్రిన్సిపాల్ పద్మావతి, ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్, సీఐ గంగాధర్ ఘటన తీరును పరిశీలించారు. విద్యార్థిని హాస్టల్ గదిలో ఉన్న పుస్తకాలను, ఆమె వాడుతున్న వస్తువులను పరిశీలించారు, తోటి విద్యార్థినులను, సిబ్బందిని విచారించారు. కాగా భయంతో అత్యధికశాతం విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు కోరుతున్నా, 10, ఇంటర్ విద్యార్థులను మాత్రం అధికారులు ఇళ్లకు పంపడం లేదు.


జవహర్ నవోదయ విద్యాలయం నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థినులు

వ్యవసాయం, జీవనోపాధికి సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి అత్యవసరం

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పాదకత పెంపు, గ్రామీణ జీవనోపాధి మెరుగుదలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం అత్యంత అవసరమని డెవలప్‌మెంట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫీస్(డీఎంఈవో) నీతి ఆయోగ్ డైరెక్టర్ మహమ్మద్ జుబైర్ అలీహస్మీ పేర్కొన్నారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను గురువారం ఆయన సందర్శించారు. అక్కడ చేపడుతున్న విస్తరణ కార్యక్రమాలు, ఆధునిక వ్యవసాయం, సాంకేతికతపై శిక్షణ తదితరాలను అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సుమతి ఆయనకు వివరించారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకోవాలని హస్మీ సూచించారు. అనంతరం రైతులతో పలు అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివ జ్యోతి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, కోవూరు ఏడీఏ అనిత, శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.


రైతులతో బృంద చర్చలో డీఎంఈవో నీతి అయోగ్ డైరెక్టర్ మహమ్మద్ జుబైర్ అలీహస్మీ

మీన.. లాభాల్లోన!



సంగం : పడమటిపాళెంలో చేపల సాగు చెరువు

- రొయ్యల కంటే చేపలకే ప్రాధాన్యత
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సహజ సిద్ధంగా పెరిగే పైలట్, కొరమీను, మట్టగిడసలు
- గెండి, బొచ్చ రకం చేపలకూ ఆదరణ
- ఏటా 1.7 లక్షల టన్నుల ఉత్పత్తి
- తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళలకు ఎగుమతి
- నెల్లూరు పులుసు అంటే లొట్టలు వేయాల్సిందే!
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల పెంపకానికి ఒకప్పుడు నెల్లూరు ప్రసిద్ధి. అయితే, అందులో ఒడిదొడుకులు ఎక్కువగా ఉండటంతో సాగుదారులు చేపల పెంపకంపైనే మొగ్గు చూపుతున్నారు. సాగు ఖర్చులు తక్కువ, ధర స్థిరంగా ఉండటమే ఇందుకు కారణం. గడిచిన మూడేళ్లలో పోలిస్తే జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో సాగు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గెండి, బొచ్చ, మోసు, రూప్‌చంద్ వంటి రకాల చేపలే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఏడాదికి సరాసరి 1.7 లక్షల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి అవుతున్నట్లు మత్స్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. 2023-24లో 1,66,578 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి రాగా 2024-25లో మాత్రం 1,80,255 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఈ లెక్కన ఈ ఏడాది మరింత ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గెండి, బొచ్చ రకాలే ఎక్కువ

జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కోవూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్, పొదలకూరు, కలువాయి, ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల తదితర మండలాల్లో 5వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతోంది. వీటితోపాటు 276 చెరువులు, కండలేరు, గండిపాళెం, రాళ్లపాడు, కనిగిరి రిజర్వాయర్లలో లీజు చొప్పున చేపలు పెంచుతున్నారు. ఇంకా సర్వేపల్లి, సోమశిల జలాశయాలతోపాటు నెల్లూరు చెరువుల్లోనూ చేపల సాగుకు మత్స్యశాఖ లైసెన్సులు మంజూరు చేసి, అనుమతులు ఇస్తోంది. మొత్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,80,255 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చినట్లు మత్స్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో 40శాతం అంటే 72,102 మెట్రిక్ టన్నులు గెండి చేపలే ఉత్పత్తి అయ్యాయి. ఆ తర్వాత 35 శాతం అంటే 63,089 మెట్రిక్ టన్నులు బొచ్చ, మరో 20శాతం అంటే 36,051 మెట్రిక్ టన్నులు మోసు, 9012.75 మెట్రిక్ టన్నుల రూప్ చంద్ చేపలు సాగు అయ్యాయి. కొరమీను, జిలేబి, మట్టగిడసలు సహజ సిద్ధంగా పెరుగుతున్నా స్థానిక అవసరాలకే సరిపోతున్నాయి. బొచ్చ, గెండి చేపలు సరాసరి 900 నుంచి 1200 గ్రాముల వరకు ఉన్నవి పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. సంవత్సరానికి రూ.2 వేల కోట్లకుపైగా టర్నోవర్ జరుగుతున్నట్లు అంచనా.



ఈయన పేరు అల్లూరు శ్రీధర్‌రెడ్డి, సంగం మండలం కోలగట్ల గ్రామం. మోటార్ల కింద ఈయనకు 13 ఎకరాల పొలం ఉంది. మొదట్లో వరిసాగు చేసేవారు. పెద్దగా ఆదాయం రాకపోవడంతో 1996 నుంచి చేపల సాగు చేపట్టారు. ఎకరా పొలంలో 2,500 చేప పిల్లలను విడుదల చేస్తారు. అందులో 2,200 గెండి, కట్ల (బొచ్చి) 300, గడ్డి చేపలు 50 విడుదల చేస్తామన్నారు. తొమ్మిది నెలలకు ఒక్కో చేప బరువు ఒకటిన్నర కిలో నుంచి రెండు కిలోల వరకు వస్తుంది. ఏకరా విస్తీర్ణంలో 2 టన్నుల వరకు చేపల దిగుబడి వస్తుంది. ఒక్కో టన్ను రూ.1.10 లక్షలు చొప్పున ఆదాయం వస్తుంది. ఒక ఎకరాకు పెట్టుబడి (చేప పిల్లలు, మేత) రూ.1.5 లక్షలు అవుతుంది. పెట్టిన పెట్టుబడికి రూ.20 వేలు వడ్డీ కింద తీసేసినా పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతుంది.


గెండి చేపలు

నేడు వేడుక

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెల్లూరు పురమందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కే.శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్యరంగం అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న ఈ కార్యక్రమంతో జిల్లాలోని మత్స్యకారులు, సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఆక్వా రైతులు, బోటు యజమానులు, మత్స్య రంగంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


బొచ్చ

ఆరోగ్య ప్రయోజనాలివి!

చేపలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. గుండెతో పాటు మెదడుకు ఎంతో మేలు చేస్తుంది. చేపలో ఉండే ఒమేగా- 3 ఫ్యాటి యాసిడ్స్ గుండెకు బలం చేకూరుస్తాయి. ఆస్తమాను తగ్గిస్తుంది. అంతేకాదండోయ్.. సీవీపీడీ వంటి వ్యాధులు, అతిసార, చర్మ అలెర్జీను తగ్గిస్తాయి. ఒమేగా 3 అమ్లాలు కంటి చూపును మెరుగు పరుస్తాయి. కొవ్వు అమ్లాలు మెదడుకు ఎంతో మేలు చేకూరుస్తాయి. వృద్ధులలో వచ్చే మతిమరుపు రోగాన్ని నివారిస్తాయి. గర్భిణులు చేపలు తినడం వల్ల పుట్టే పిల్లల మెదడు పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. విటమిన్ డి, బి2, ఐరన్, జింక్, అయోడిన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఆరోగ్య ప్రయోజనాలు చేపలో ఉంటాయి.



కడలి చేపలు ఎగుమతులకే

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఏడాదికి దాదాపుగా 45వేల మెట్రిక్ టన్నుల సముద్రపు చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 47,772 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ ఉప్పు చేపలు దాదాపుగా చెన్నై, బెంగళూరు, బెంగాల్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మొత్తం ఉత్పత్తిలో 10 శాతం మాత్రమే జిల్లా అవసరాలకు వినియోగిస్తున్నారు. కోవూరు మండలం సాలుచింతల ప్రాంతం కేవలం ఉప్పుచేపల వ్యాపారానికి ప్రసిద్ధి. దూరప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఆంధ్రా వంటకాల్లో..

ఆంధ్రా వంటకాల్లో చేపల పులుసుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా దీని వాసన, రంగు, రుచితో ప్రత్యేక వంటకంగా గుర్తింపు పొందింది. కూరలో మామిడికాయ వేయడం వల్ల ప్రత్యేక రుచి వస్తుంది. కాస్త చింతపండు కూడా వేయడంతో పులుసు చక్కగా కుదురుతుంది. భోజనప్రియులు పోషక విలువలకంటే కూడా రుచికే ప్రాధాన్యం ఇస్తారు కాబట్టి నెల్లూరు చేపల పులుసంటే ఆహా అనాల్సిందే. ప్రత్యేక కార్యక్రమాలు, పండుగలు ఇతరత్రా కార్యక్రమాల్లో చేపల పులుసు లేని మెనూ ఉండదు. అంతేకాదండోయ్.. ప్రత్యేక ప్యాకింగ్‌లో విదేశాల్లోని ఆత్మీయులకు కూడా పంపుతున్నారంటే నెల్లూరు చేపల పులుసు ఎంత ప్రాచూర్యం పొందిందో అర్థమవుతోంది.

పెట్టుబడే కీలకం



చేపల పెంపకంలో పెట్టుబడి చాలా కీలకం. అవసరానికి తగ్గట్టు ఖర్చులు పెచ్చిస్తేనే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. ఐదేళ్లుగా చేపలు పెంచుతున్నా. ముందుగా చేప పిల్లలు పెంచి రైతులకు విక్రయించాలని సిద్ధపడ్డాను. అయితే పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పెంపకంపైనే దృష్టి పెట్టాను. నష్టం రాకపోయినా అధిక లాభాలు మాత్రం రావు. మార్కెట్లో చేపలకు గిరాకీ ఉన్నా ధరలు మాత్రం ఆశాజనకంగా ఉండవు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా. తద్వారా కొంతమేర ఫలితాలు వస్తున్నాయి.

- గోళ్ల వెంకటేశ్వర్లు, అల్లూరు.

చేపల సాగే జీవనాధారం



మాది తూర్పు గోదావరి జిల్లా కాకినాడ. అనంతసాగరం మండలం గౌరవరం వద్ద గుంతలు లీజుకు తీసుకొని చేపలు పంచుతున్నాం. మొదటి నుంచీ ఇదే మా వృత్తి. చేపల పెంపకంలో ఒడిదుడుకులు ఉంటాయి. అన్నీ తట్టుకుని చేపలు పెంచుతున్నాము. లీజు, పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు ఏడాదికి రూ.30 వేల నుంచి 50 వేలు ఆదాయం వస్తోంది.

- పెంచల నరసయ్య, అనంతసాగరం

చిన్నారులు దేశానికి సంపద : ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం),(ఆంధ్రజ్యోతి) : చిన్నారులు సమాజానికి, దేశానికి సంపద అని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జడ్పీ హైస్కూల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల భద్రత, సంరక్షణ, అభివృద్ధికి అందరూ ప్రాధాన్య మివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభా రాణి, బాలల సంరక్షణ సమితి చైర్మన్ టీ మాధవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడటమే లక్ష్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో గురువారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటికే ఎంపిక చేసిన బ్లాక్‌స్పాట్లపై ఎన్‌హెచ్ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్ వేయాలన్నారు. బుజబుజనెల్లూరు నుంచి భగత్‌సింగ్ కాలనీ వరకు 9 ప్రమాదభరిత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అన్నీ నివారణ చర్యలు సత్వరమే తీసుకోవాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సులు లోపలికి, బయటకు వచ్చే ప్రాంతాల్లో బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లు ఆక్రమణలు గురికాకుండా చూడాలన్నారు. వీధి వ్యాపారులు ఎక్కువ సమయం ఉండకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రామకృష్ణ, డీటీసీ చందర్, ఎన్‌హెచ్ఏ పీడీ ఎంకె చౌదరి, డీపీవో శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఆత్మకూరు ఆర్డీవో పావని, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రోడ్డు భద్రత- ప్రమాదాల నియంత్రణపై వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత-ప్రమాదాల నియంత్రణ అనే అంశంపై రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి గురువారం అడిషనల్ డీజీపీ రోడ్‌సేఫ్టీ కేటీ ఉజేలా, డీఐజీ రోడ్ సేఫ్టీ విజయరావు నేతృత్వంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ హైవే, నేషనల్ హైవేలపై గుర్తించిన బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి అడిషనల్ డీజీపీ చర్చించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ గిరిధర్, కావలి డీఎస్పీ శ్రీధర్, సీఐలు రామారావు, భక్తవత్సలరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సేవలను విస్తృతం చేయాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- ముగిసిన సహకార వారోత్సవాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ద్వారా సేవలను విస్తృతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవ ముగింపు సభ గురువారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల సభ్యుల మధ్య అవగాహన ఉన్నప్పుడే ప్రజలకు అనుకున్న స్థాయిలో సేవలు అందించవచ్చని చెప్పారు. సంఘాలలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతీ మూడు నెలలకుగానీ, ఆరు నెలలకుగానీ సమావేశం ఏర్పాటు చేసుకుని వచ్చిన ఆదాయాన్ని సభ్యులందరికీ సమపాళ్లలో పంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా సహకారశాఖాధికారి గురప్ప మాట్లాడుతూ డీసీసీబీలు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇందుకు డైరెక్టర్‌లు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ సేవలందించిన సహకార సంఘాలు, సహకారశాఖ సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందచేశారు.

వరదకు విరామం

- వడివడిగా పనులకిదే సమయం
- ఇకనైనా చేస్తారా... లేదా!?
- సోమశిల ఆప్రాన్ బాగుకు అవకాశమిదే..!

అనంతసాగరం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సోమశిలకు వరద జలాలు ఆగిపోయాయి. అభివృద్ధి పనులకు ఇదే మంచి తరుణం. వర్షాకాలం పూర్తయింది. పనులు చేసేందుకు ఆటంకాలు తొలిగాయి. ఇక పనులు చేయడమే తరువాయి. కాగా ఈ సీజన్‌లో పనులు పూర్తిచేస్తారా? అనే సందేహం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.


సోమశిల జలాశయం ముందు అప్రాన్ దుస్థితి

కట్టడాల ధ్వంసం

నాలుగేళ్ల క్రితం ఎగువ నుంచి వచ్చిన ఆకస్మిక వరద కారణంగా జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమయ్యాయి. ఆ పనులపై గత వైసీపీ నిర్లక్ష్యం చూపింది. రూ. 100 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపారేకానీ, ఒక్క రూపాయి విడుదల కాలేదు. డ్యాం పరిధిలో అధికారికంగా, అనధికారంగా సుమారు 10 లక్షల ఎకరాల వరిసాగవుతోంది. చిత్తూరు, నెల్లూరుతోపాటు పొరుగు రాష్ట్రం చెన్నైకి తాగునీరు అందిస్తున్న బహుళార్థసాధక ప్రాజెక్టు ఇది. ఇలాంటి ప్రాజెక్టు భద్రతపై ఎంతో శ్రద్ధ వుండాలి. గత వైసీపీ నేతలు ప్రాధాన్యత ఇవ్వలేదు.దీంతో రైతుల వ్యతిరేకతను చవిచూశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులపై శ్రద్ధ చూపారు. సుమారు రూ.30 కోట్ల మేరకు విడుదల చేశారు. కొంత కాలంగా వివిధ కారణాలతో ఆగిన పనులకు నేడు అనుకూలత ఏర్పడింది. ఇక పనులు చేసేలా ఇప్పటి నుంచి చొరవ చూపితే ఈసీజన్‌లో పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. ఆదిశగా అప్రాన్, డౌన్‌స్టీమ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు చేసేలా చర్యలు

జలాశయం వద్ద అభివృద్ధి పనులు చేసేలా దృష్టి సారించాం. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

- వెంకటరమణారెడ్డి, ఎస్ఈ సోమశిల

25 నుంచి అపస్మా క్రీడలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : అపస్మా ఆధ్వర్యంలో మైథిలి మనోహర్‌రెడ్డి మెమోరియల్ క్రీడాపోటీలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. క్రీడల నిర్వహణకు పీఈటీలను కేటాయించాలని, క్రీడలకు హాజరు కావాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఆర్ బాలాజీరావుకు వినతిపత్రం ఇచ్చారు. తొలుత నియోజకవర్గ స్థాయిలో ఈనెల 25 నుంచి 30వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తుకు 30 వరకు గడువు

అనంతసాగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ ద్వారా పక్కా గృహాల మంజూరు కోసం లబ్ధిదారులు తమ పేర్లు సచివాలయాల్లో కేటాయించిన అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 30 వరకు అవకాశం ఉందని చెప్పారు. గతంలో 1,021 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని కూడా సర్వేచేస్తున్నట్లు వివరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11740
వెండి కిలో ధర	రూ. 159600
వెండి ఒక గ్రాము	రూ. 164.60

న్యూస్ బాక్స్

అర్చకుడికి సన్మానం



అర్చకుడు అనీల్‌శర్మను సన్మానిస్తున్న అయ్యప్ప మాలధారులు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్వతీ పరమేశ్వరాలయం అర్చకులు బద్దెపూడి అనీల్‌శర్మను గురువారం ఆలయంలో అయ్యప్పస్వామి మాలధారులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అయ్యప్ప మాలధారులు మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని అయ్యప్ప, శివయ్య, గోవింద, ఆంజనేయస్వామి మాలలు ధరించిన భక్తులకు ప్రతిరోజు అల్పాహారం అందించేదుకు పలువుర్ని ప్రోత్సహించి కొనసాగించారన్నారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాసులు, బాలాజీ, హరి, వెంకటప్రసాద్, వెంకటాద్రి, విజయ్, హరీష్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), జాతీయ నైపుణాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఆపై చదివిన యువతీ, యువకులకు పర్చేజ్ అసిస్టెంట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ కమ్మోడిటీ, కస్టమర్ కేర్ సర్వీసు ఎగ్జిక్యూటివ్ కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారికి సర్టిఫికేట్ అందించి ఉద్యోగావకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9491284199, 9182799405 నెంబర్లుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేల్, వేతనాలు పెంచాలని, అర్హత ఉన్నవారికి వీఆర్‌ఏ, రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని, ఏళ్ల తరబడిగా నామినీలుగా విధులు నిర్వహిస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలన్నారు. అలాగే అటెండర్, నైట్ వాచ్‌మెన్ పదోన్నతి కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలని, అక్రమ నైట్, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గయ్య, హజరత్, శ్రీనివాసులు, పిచ్చయ్య, హుస్సేన్‌బాషా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా ఏపీసీగా అనిల్ కుమార్ నియామకం



నెల్లూరు (విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యా పకుడు దాసరి అనిల్ కుమార్ ప్రకాశం జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. గురువారం రాష్ట్రం లోని 8జిల్లాలకు జరిగిన ఏపీసీల నియామకంలో భాగంగా అనిల్‌కుమార్‌ను ప్రకాశం జిల్లాకు కేటాయించారు. ఏడాది పాటు ఈ విధుల్లో ఉంటారని, ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశుభ్రత పట్టదా...?



కార్యాలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నెలల తరబడి చెత్తాచెదారం పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో వరుస చోరీలు

● బెంబేలెత్తుతున్న గ్రామస్థులు



రామదేవులపాడులో చోరీకి గురైన రామాలయం (ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి శివారున మెట్ట ప్రాంతమైన వరికుంటపాడు మండలంలో చోటు చేసుకుంటున్న వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. నివాసాలు, దుకాణాల సంగతి అటుంచితే ఇటీవల దుండగులు పక్కా ప్రణాళికతో ఆలయాలపై దృష్టి సారిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉంటుండడంతో రాత్రి సమయాల్లో ప్రజలు నివాసాలకే పరిమితం అవుతుండడం దుండగులకు వరంగా మారుతోంది. అలాగే పల్లె ప్రాంతాల్లోని వీధుల్లో జనసంచారం కూడా అంతంత మాత్రంగానే ఉంటుండడంతో ఆలయాలలో చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయాల్లోని విలువైన అమ్మవారి మంగళ సూత్రాలతో పాటు హుండీలను చోరీ చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నెల 15న కనియంపాడులోని రామాలయం, నాగరప్పమ్మ ఆలయాల్లో హుండీలను పగులకొట్టి నగదు తీసుకెళ్లిన దుండగులు గ్రామ శివారు ప్రాంతంలో పడేశారు. వీటికితోడు 13న రామదేవులపాడు రామాలయంలో అమ్మవారి మెడలోని నాలుగు మంగళసూత్రాలు చోరీకి గురయ్యాయి. గతనెల 27, 31న దక్కనూరు, అశోక్‌నగర్ రామాలయాల్లో హుండీలను చోరీచేశారు. అంతకుముందు కూడా తూర్పుకొండారెడ్డిపల్లి, వరికుంటపాడులోని రామాలయాలలో, వీరబ్రహ్మేంద్రస్వామి, విరువూరులోని గ్రామదేవతల ఆలయాలలో, పామూరు పల్లిలోని సుబ్బరాయుడుస్వామి ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. గ్రామాల్లో పోలీసుల గస్తీ కొరవవడంతో రోజుకో ప్రాంతంలో దుండగులు చోరీలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతుండడంతో నివాసాల్లోని ప్రజలు సైతం దొంగల భయంతో జాగారం చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆలయాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తూర్పుకొండారెడ్డిపల్లిలో కంపచెట్లలో పడేసిన హుండీ (ఫైల్)

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని బీసీ కాలనీలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం కార్తీక మాసం, అమావాస్య తిథిని పురస్కరించుకుని భక్తులు పరమేశ్వరునికి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు సాయినాథుని, పరమేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామివారికి కాయా కర్పూరం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అంకాళమ్మ తిరుణాళ్ల



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ

అనంతసాగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులోని గ్రామదేవత అంకాళమ్మ తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



సొసైటీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యక్షులు, సిబ్బంది, రైతులు

సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో (సొసైటీ) 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సొసైటీ ఛైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం సహకార సంఘం అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా సహకార సంఘం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సొసైటీ డెరెక్టర్లు పిట్టు పట్టాభిరామిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, రాజారెడ్డి, సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో బాలకృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

● బీజేపీ నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు మాధవ్, వంశీధర్‌రెడ్డిల ఆదేశానుసారం బుధవారం స్వదేశీ వస్తువులు వినియోగించాలని ఉదయగిరి పట్టణంలో బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. అనంతరం కేంద్ర సహకార బ్యాంకుకు దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, గడ్డం ప్రసాద్, కార్తీక్, మస్నేటి శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

● సీడీపీవో సునీలత



అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న సీడీపీవో సునీలత, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని సీడీపీవో పి సునీలత సూచించారు. గురువారం ఆమె 20వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యనందించాలన్నారు. తల్లి పాలల్లో అనేక పోషక విలువలున్నాయని, ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలని, అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలన్నారు. బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తెలియజేస్తే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, టీడీపీ నాయకుడు చిన్నబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూమిని పరిశ్రమలకు అప్పగించొద్దు

● రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పడమటి రొంపిదొడ్ల రైతులు

సీతారామపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలోని సర్వే నెంబర్ 88లోని 34.50 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమిని రాష్ట్రప్రభుత్వం ఏపీఐసీఈ కింద సిబిజి ప్లాంట్‌కు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా పశువుల మేత పోరంబోకుగా ఉన్న భూమిలో గ్రామంలోని పశువులు, గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆ భూమిని పరిశ్రమ లకు అప్పగిస్తే మా జీవనం దెబ్బతింటుందని, గ్రామం వదిలి వెళ్ళిపోయే పరిస్థితి వస్తుందని వాపోయారు. మూగజీవాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని, ఆ భూమిని సిబిజి ప్లాంట్‌కు కేటాయించకుండా రద్దుచేసి జీవనాధారాన్ని కాపాడాలని కోరుతూ తహసీల్దార్ షేక్ ఫజిహాకు వినతిపత్రం అందచేశారు.

రాత్రిపూట జాతీయ రహదారి కూడళ్లలో అంధకారం

● రోడ్డు దాటాలంటే భయపడుతున్న జనం



సిద్దేశ్వరం వెళ్లే మార్గంలోని జాతీయ రహదారి కూడలి వద్ద కనిపించని విద్యుత్ దీపాలు

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): సీతారామపురం - కావలి 167 బీజీ జాతీయ రహదారి నిర్మించడంతో మండల వాసులు సంతోషించారు. కానీ కొన్ని గ్రామాల కూడళ్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీతారామపురం నుంచి ఉదయగిరి మార్గంలోని పోలంగారిపల్లి కూడలి గుండా సోంపల్లి నెమళ్లదిన్నె, గంగవరం, బెడుసుపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. జాతీయ రహదారి ఏర్పడడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. కాగా, ఈ కూడలి వద్ద కాకుండా కొంతదూరంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇటుగా వెళ్లాల్సిన గ్రామాల వారు రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ప్రాచీన శైవక్షేత్రం ఘటిక సిద్దేశ్వరానికి వెళ్లే మార్గం వద్ద కూడా దీపాలు ఏర్పాటు చేయలేదు. పోకలవారిపల్లి ఎస్సీ కాలనీకి సైతం ఇటుగా వెళ్లాల్సి ఉంది. సంజీవరెడ్డినగర్ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. రాత్రిళ్లు రోడ్డు దాటే సమయంలో వాహనాలు వచ్చే వేగం తెలియక ఇబ్బందులు పడు తున్నామని, ఇప్పటికైనా ముఖ్య కూడళ్ల, గ్రామాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, వా ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మౌలిక సదుపాయాలు ఎక్కడ..?

● కానరాని ప్రథమ చికిత్స పెట్టెలు ● ప్రయాణికుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మౌలిక సదుపాయాలపై అధికారులు సారించడంలేదు. బస్సులు ప్రమాదానికి గురైతే ప్రయాణికులకు కనీసం ప్రథమ చికిత్స కూడా అందడంలేదు. గతంలో బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు ఉండేవి. కానీ వాటిని పట్టించుకోకపోవడంతో కానరావడం లేదు. ఇటీవల ప్రమాదాల నేపథ్యంలో బస్సుల్లో పెట్టెలను తప్పనిసరిగా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. కొన్ని ఆర్టీసీ బస్సుల్లో అరకొరగా ఉన్నా వాటిలో మందులు కనిపించడంలేదు.

పెరిగిన ప్రయాణికుల రద్దీ

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు పెరిగాయి. నెల్లూరు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు నూతన సర్వీసులను ప్రారంభిస్తున్నారు. కానీ అధికశాతం బస్సుల్లో ఖాళీ పెట్టెలే కనిపిస్తున్నాయి. వీటిలో ప్రథమ చికిత్స కిట్లు లేవు. ఒకవేళ ఉన్నా వాటిల్లో చాలావరకు కాలం చెల్లినవే ఉన్నాయని సిబ్బంది తెలుపుతున్నారు.

ప్రథమ చికిత్స పెట్టెలో ఉండాల్సినవి ఇవే

మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. బస్సు డ్రైవర్ వెనుక ఈ పెట్టె ఉండాలి. దూది, కత్తెర, టించర్, ఆయోడిన్, యాంటీసెప్టిక్ క్రీం, కాటన్ బ్యాండేజీ, వాటర్‌ప్రూఫ్ ప్లాస్టర్, నొప్పి తగ్గించే మాత్రలు వంటివి అందుబాటులో ఉండాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆ పెట్టెలో ఉన్న సామాగ్రితో ప్రథమ చికిత్స చేయాల్సి ఉంది.



బస్సులో నామమాత్రంగా ఉన్న ప్రథమ చికిత్స పెట్టె

కానీ బస్సుల్లో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స పెట్టెల్లో ఈ మందులు కనిపించడంలేదు. ఒకవేళ ఉన్నా అవి కాలంచెల్లినవి ఉంటున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల్లో ఉన్న ప్రథమ చికిత్స పెట్టెల్లో అన్ని మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

రైల్లో నుంచి పడి ప్రయాణికుడి మృతి

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 3లో కాకినాడకు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికుడు రేకాడి నూకరాజు(55) బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. కావలి జీఆర్పీ ఎస్ఐ వెంకటరావు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి ఈస్ట్‌గోదావరి జిల్లా ఐ పోలవరం మండలం టీ కొత్తపల్లికి చెందిన రేకాడి నూకరాజు చెన్నై నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరాడు. రైలు బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆగే సమయంలో డోర్ వద్ద నిలుచుని ఉండగా ప్రమాదవశాత్తు జారి రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య పడి మృతి చెందాడు. ఈ సంఘటనతో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటరావు గురువారం తెలిపారు.

గువ్వాడి గ్రామంలో చోరీ



బీరువాలో దుస్తులను కిందపడేసిన దొంగలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యాదిగిరి చినగురుస్వామి నివాసంలోకి అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న దుస్తులు, ఇతరత్రా వస్తువుల చోరీకి పాల్పడ్డారు. ఈవిషయమై గురుస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు నివాసాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

ఉదయగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వింజమూరు పట్టణానికి చెందిన యువకుడు సాధిక్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. ఈమేరకు అతన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి అంజయ్య వచ్చేనెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించారన్నారు. దీంతో అతన్ని జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

మద్యం మత్తులోనే స్నేహితుడి హత్య!

● రూ.500 విషయమై ఘర్షణ

● అనుమానాస్పద మృతిని ఛేదించిన పోలీసులు



షాజహాన్ (ఫైల్)

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యువకుడి అనుమానాస్పద మృతిని పోలీసులు ఛేదించారు. రూ.500 విషయమై ఏర్పడిన వివాదం చినికి చినికి పెద్దదై మద్యం మత్తులో స్నేహితుడి హత్యకు దారితీసిన ఈ ఘటన కోవూరులో గత నెలలో జరిగింది. సీఐ సుధాకరరెడ్డి కథనం మేరకు.. కోవూరు మండలం పడుగుపాడు సాలుచింతల మసీదు వీధి ప్రాంతానికి చెందిన షాజహాన్‌కు అదే ప్రాంతానికి చెందిన చేజర్ల రాజా అలియాస్ కుక్కల రాజా, పోతిరెడ్డిపాళేనికి చెందిన షేక్ మస్తాన్‌వలి, నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీకి చెందిన జ్యోతి చిన్న అలియాస్ సుబ్బయ్య, పోతిరెడ్డిపాళెం శ్రీవాణి కాలనీకి చెందిన యద్దల పెంచలయ్య స్నేహితులు. ఈ ఐదుగురు కలిసి తరచూ ఆటోలో తిరుగుతూ మద్యం సేవించేవారు. గత నెల 25న సాలుచింతల కూడలిలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి పక్కనే అరటికాయలు నిలువ చేసే గోదాములో మద్యం సేవించారు. రాజా-మస్తాన్‌వలి మధ్య రూ.500ల విషయమై ఘర్షణ తలెత్తింది. ఇద్దరి మధ్య తలెత్తిన ఘర్షణను షాజహాన్ నివారించాడు. ఈ క్రమంలో షాజహాన్ పెదవిపై గాయమైంది. వెంటనే కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని పెదవికి వైద్యసహాయం పొందాడు. స్థానిక బజారుకూడలిలోని ఓ మద్యం దుకాణంలో తిరిగి రెండో పర్యాయం మద్యం కొనుగోలు చేసి సేవించాడు. తనపెదవిపై గాయం చేశారనే ఆగ్రహంతో షాజహాన్ బ్లేడుతో రాజా శరీరంపై దాడి చేశాడు. దీంతో కోపోద్రిక్తులైన రాజ, మస్తాన్‌వలి మద్యం మత్తులో షాజహాన్ తలను సిమెంటు దిమ్మెకు ఆనించి కొట్టారు. సిమెంటు దిమ్మెకు తల బలంగా తగలడంతో షాజహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఘటనాస్థలం నుంచి పెంచలయ్య, సుబ్బయ్య పారిపోయారు. షాజహాన్ మృతదేహాన్ని రాజా, మస్తాన్‌వలి ఆటోలో వేసుకుని లక్ష్మీనారాయణపురం సమీపంలోని వేగూరు కాలువలో తొక్కేసి వెళ్లారు. నాలుగు రోజుల తరువాత శవం తేలియాడుతూ కన్పిస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు మృతదేహం గురించి ఆరాతీసినప్పటికీ గుర్తించలేకపోయారు. పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఖననం చేశారు. ఈనెల 16న తన తమ్ముడు అదృశ్యమయ్యాడని మస్తాన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహం ఫొటోలు, దుస్తులు చూపెట్టడంతో షాజహాన్‌గా గుర్తించారు. దీంతో అతని స్నేహితులపై దృష్టి సారించిన సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐ ముత్యాలరావు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెలుగ చూశాయి. హత్యానేరాన్ని వెలికితీసిన పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.

డిఫెన్స్ మద్యం సీసాల స్వాధీనం

● బాటిల్‌పై రూ.1000 అధికంగా విక్రయం



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అతనో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. అతని క్యాంటీన్ కార్డుతోపాటు మరికొందరి కార్డుల ద్వారా డిఫెన్స్ మద్యం కొనుగోలు చేసి ధరలకు విక్రయించడం ప్రారంభించాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు పథకం ప్రకారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని బీవీనగర్ బ్యాంకు కాలనీకి చెందిన బసివిరెడ్డి జగదీశ్వరరెడ్డి డిఫెన్స్ మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు మధ్యవర్తులను పంపి మద్యం కావాలని అడిగించారు. జగదీశ్వరరెడ్డి బాటిల్ ఎమ్మార్పీపై రూ.1000 అధికంగా తీసుకొని మద్యం విక్రయిస్తుండగా బుధవారం రాత్రి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 750 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. విచారించగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఎస్ఐ డీ శ్రీధర్ గురువారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

18 కిలోల గంజాయి పట్టివేత

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇనమడుగు రోడ్డు కూడలిలో గురువారం ఎక్సైయిజ్ పోలీసులు ఓ మహిళ నుంచి 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైయిజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా తమిళనాడు రాష్ట్రం మదురై పట్టణానికి చెందిన తిరుపతి మణిమేఘలై సూట్‌కేసులో గంజాయి తీసుకువెళ్తు పట్టుబడింది. ఒడిశాలోని రాయగడలో గంజాయి కొనుగోలు చేశాడు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 660

డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభదాయకం

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు దొండపాడు రైతుసేవా కేంద్రంలో ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్ పంటల సాగుపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మండల ఉద్యాన అధికారి బీ జ్యోతి తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు రైతులకు లాభదాయంగా ఉంటుందన్నారు. ఉద్యాన రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగు మొక్కల కొనుగోలు ఖర్చు, సిమెంట్ స్తంభాల ఖర్చు, సాగు కలిపి రెండేళ్ల పాటు సబ్సిడీ మొత్తం రూ.2,70,000 ప్రభుత్వం అందిస్తుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కల మధ్య 10 అడుగులు దూరం పెట్టి నాటుకోవచ్చని, సాగులో మెలకువలు తెలిపారు. అదేవిధంగా నీటి వసతి అనుకూలంగా ఉన్న నేలల్లో ఆయిల్ పామ్ సాగు కూడా చేపట్టవచ్చని సూచించారు. డ్రిప్ అనుసంధానం చేసుకుంటే మేలైన దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది జగదీష్, ఆయిల్ పామ్ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ ఏదీ..!?

- ఎంఆర్‌సీకే పరిమితమైన ఎంఈవోలు
- అడ్రస్ లేని సీఆర్ఎంటీలు
- సమయపాలన లేని ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో మెరుగుపడని విద్యా ప్రమాణాలు
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- అమలు కాని మధ్యాహ్న భోజనం మెనూ
- పట్టించుకోని ఉన్నతాధికారులు


వలేటివారిపాలెం ఎంఆర్‌సీ కార్యాలయం

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఎంఈవోలు, సీఆర్ఎంటీలు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయానికే పరిమితమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. దీంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో విద్యా ప్రమాణాలు దిగజారుతోన్నాయని, మధ్యాహ్న భోజన పథకంలో సైతం మెనూ సక్రమంగా అమలు జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో 41 ఎంపీపీ స్కూళ్లు, 4 ఎంపీయూపీ స్కూళ్లు, 4 ఉన్నత పాఠశాలలు, 1 మోడల్ స్కూల్, 1 కేజీబీవీ ఉన్నాయి. ఆ పాఠశాలలో సుమారు 3,500 మందికి పైగానే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు నిత్యం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ఇద్దరు ఎంఈవోలు ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వచ్చి వెళుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఒక్కో ఎంఈవో రోజుకు రెండు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేసి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించాలి. అయితే అలాంటి పరిస్థితి మండలంలో జరుగుతున్న దాఖలాలు లేవని తెలిసింది. అలాగే మండలానికి ఉన్న ఇద్దరు క్లస్టర్ రిసోర్స్ మానిటరింగ్ టీచర్లు (సీఆర్ఎంటీ)లు కూడా నిత్యం పాఠశాలలను తనిఖీలు చేయాలి. అయితే వీరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో కూడా తెలియదని ఉపాధ్యాయ వర్గాలే బహిరంగంగా చర్చించుకొంటున్నారు. విధులు నిర్వహించకుండానే సొంత పనులు చేసుకుంటూ ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యా ప్రమాణాలు, వసతులు మెరుగుపడక పోగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, బోగస్ హాజరు మాత్రం నమోదవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి పాఠశాలలపై పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యూస్ బాక్స్

నేడు లింగసముద్రంలో ప్రజాదర్బార్

లింగసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు ఎం కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను ఎమ్మెల్యేకి అందజేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ మండల కమిటీ నియామకం

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్‌సీలో గురువారం అంగన్‌వాడీ మండల నూతన కమిటీ ఏర్పడింది. జిల్లాలో వలేటివారిపాలెం పైలట్ మండలంగా ఎంపికైన సందర్భంగా ఎంఈవో మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో అంగన్‌వాడీ మండల అధ్యక్షుడుగా ఎంఈవో 1 మాల్యాద్రిరెడ్డి, కోచైర్మన్‌గా సీడీపీవో ఉషారాణి, సభ్యులుగా సూపర్‌వైజర్లు సునీత, రుబీనా, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, కార్యకర్తలు ఎస్తేరమ్మ, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఎంఈఓ 2 మల్లికార్జునరావును సభ్యులుగా ఎన్నుకున్నారు.

పోలినేనిపాలెంలో నేడు పరిశుభ్రతపై శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శిక్షణ తరగతులకు క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రలు, తదితరులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కావలి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిష్ణాపురం నవోదయ పాఠశాల విద్యార్థిని కత్తి ప్రణీత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వివిధ గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు పేర్కొన్నారు. పట్టణంలోని అడవిరాజుపాలెంలో గురువారం జరిగిన ప్రణీత అంత్యక్రియల్లో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బ్రహ్మయ్య, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హజరత్, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, రాపూరి క్రిష్ణయ్య, విద్యారంగం పోరాటసాధన కమిటీ కన్వీనర్ శ్యామల తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. మృతురాలి తండ్రి ఎంఈవో రవికుమార్, కుటుంబ సభ్యులతో రామర్శించారు. ఈ మృతిపై కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన రాష్ట్ర మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ సంఘటనపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు రుద్రాభిషేకం

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వెలసి ఉన్న జ్ఞాన ప్రసున్నాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం కార్తీక మాస రుద్రాభిషేక పూజలు జరిగాయి. వేదపండితులు వేదగిరి ఆంజనేయవరప్రసాదాచార్యులు కార్తీక మాస చివరి రోజున శాస్త్రోక్తంగా పూజాభిషేకాలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లతో పాటు నంధీశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ పూజల్లో కోవూరుపల్లి, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు, ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర దంపతులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'దళితుల ఇళ్ల స్థల పట్టాలు నా దగ్గర లేవు'

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండసముద్రం జగనన్న కాలనీలో దళితులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు నా దగ్గర లేవని గ్రామ పంచాయతీ సర్పంచు భర్త మన్నం వెంకటరమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వారి పట్టాలు నావద్ద ఉన్నాయని సీపీఐ నేత సురేష్‌బాబు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 86 మంది దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ఇచ్చారని తెలిపారు. వాళ్లందరికీ ఇళ్లు మంజూరు కాగా కొందరికీ మొదటి బిల్లు డబ్బులు కూడా వచ్చినట్లు తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిందారోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్


వాహనాలను తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీస్ అధికారులు

ఉలవపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్లూరు, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు సముద్ర తీర ప్రాంతంలో గురువారం సాగర్ కవచ్ నిర్వహించినట్లు మెరైన్ సీఐ జీ శివన్నారాయణ తెలిపారు. సాగర్ కవచ్‌లో భాగంగా కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్(మాక్ డ్రిల్)లో ఇండయన్ కోస్ట్ గార్డు, ఇండియన్ నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఇంటలిజెన్స్, మత్స్య శాఖ, వివిధ భద్రతా విభాగాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ మాక్ డ్రిల్ శుక్రవారం కూడా కొనసాగుతుందని చెప్పారు. నెల్లూరు ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఒంగోలు నోడల్ అధికారి డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావుల పర్యేక్షణలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వీవీపాలెం, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు ఎస్ఐలు మరిదినాయుడు, కే.అంకమ్మ, బీ.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

మెప్మా మై స్టోర్ ప్రొడెక్ట్ డెలివరీ


స్వయం సహాయక సభ్యులకు చెక్కు అందిస్తున్న కాంతయ్య

కావలి(టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ మెప్మా కార్యాలయంలో గురువారం ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్రొడెక్ట్ డెలివరీ జరిగింది. స్వయం సహాయక సభ్యులు స్వయంగా తయారు చేసిన 90 రకాల వస్తువులను ఓఎన్‌డీసీ మైస్టోర్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నందు ఆన్‌బోర్డింగ్ చేశారు. జిల్లా టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కాంతయ్య పాల్గొని మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీ మెప్మా పరిధిలో ఈపాటి 756 ఆర్డర్లు వచ్చాయన్నారు. వీటికి సంబంధించిన తయారీదారులకు మెప్మా ద్వారా రూ.47,450 చెక్కును అందజేశామన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదంలో భాగంగా మెప్మా స్వయం సహాయక సభ్యులకు ఆర్థిక తోడ్పాటుగా ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసి పొదుపు సభ్యులు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎంఎం భారతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కొండయ్య, అరుణ, సునీత, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వలేటివారిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పాకల హైస్కూల్‌లో, కనిగిరి మండలం కంచర్లవారిపాలెం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూసిన వలేటివారిపాలెం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ కత్తి ఐజక్ తెలిపారు. 14, 17 ఏళ్ల విభాగాల్లో కబడ్డీ, ఖోఖోకు ఎంపికైన చప్పిడి అశ్విత, చొప్పర లోకేష్, ఈర్ల పూజిత, మర్రి మణివిష్ణు, గూడూరు సంతోష్‌లు కర్నూలు, మచిలీపట్నంలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ పాఠశాలగా ఇస్కపల్లి జడ్పీ హైస్కూల్

- స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి
- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర


కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న రవిచంద్ర

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సహకారంతో ఇస్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని ఇస్కపల్లి శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ఇంటర్మీడియట్ కోర్సును ప్రవేశపెట్టిన నేపథ్యంలో ల్యాబ్‌లు, తరగతి గదులను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అన్ని మజరా గ్రామాల నుంచి వచ్చే 422 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, వంటగది, భోజనశాలలను నిర్మించేందుకు తన మిత్రుడు హరిశ్రీనివాస్ ముందుకొచ్చారన్నారు. రాజ్యసభ సభ్యుడి నిధులు రూ.25 లక్షలతో కంప్యూటర్ తరగతి ఏర్పాటు చేశామన్నారు. మంత్రి లోకేష్, దాతల భాగస్వామ్యంతో రూ.4 కోట్లు వెచ్చించి 20 తరగతి గదులను నిర్మించి వచ్చే విద్యా సంవత్సరానికి అందించే విధంగా ప్రణాళికలు రచించామన్నారు. ఇప్పటికే 3 ఎకరాలను ఆట స్థలానికి సేకరించామని, రెండేళ్లలో మోడల్ స్కూల్‌గా రూపొందుతుందన్నారు. ఈ పాఠశాలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా 2027 జూన్ నాటికి అభివృద్ధి చేసేలా గత కలెక్టర్ ఆనంద్ మాస్టర్ ప్లాన్ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పాపనబోయిన జగన్, హారూన్ రషీద్, పాటి రంజిత్, ఎంపీడీవో రజనీకాంత్, డీటీ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, దీనిలో భాగంగా పేదలకు సొంత ఇంటి కలలను నిజం చేస్తున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరు అర్బన్ పరిధిలో 417 మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. వారిలో కోటారెడ్డినగర్, బృందావనం సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు గురువారం అనుమతి పత్రాలు అందచేశారు. సొంత స్థలాలు ఉండి ఇల్లు కట్టుకోలేని వాళ్లు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అర్హులైన వారి గృహ నిర్మాణానికి అనుమతి పత్రాలు అందేలా రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారులు కలికట్టుగా పనిచేయాలన్నారు. సొంత స్థలాలు లేనివారికి అవసరమైతే ప్రైవేటు భూమని కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డీఈ నారాయణ, ఏఈ సుబ్బారావు, తహసీల్దారు లావణ్య, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పోకూరి రాంబాబు, చిలకపాటి మధుబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి కొలతల్లో తేడాలు

- అధికారులపై ఎమ్మెల్యే కాకర్ల ఆగ్రహం


రహదారి కొలతలు తీయిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణ పనుల్లో భాగంగా కలిగిరి పట్టణంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం తహసీల్దారు కార్యాలయం కూడలి నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా వరకు పరిశీలించారు. ఈ క్రమంలో నాలుగైదు చోట్ల రోడ్డు విస్తరణ కొలతలు తీయించారు. కేవలం అరకిలో మీటరు నిడివిలో కొన్ని ప్రదేశాలలో 82 అడుగులు, 62 అడుగులు వంతున ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న ప్రదేశాల వద్ద డ్రైనేజీలను పగులకొట్టి తిరిగి 82 అడుగులు నిర్మాణం చేయాలన్నారు. నిడివి తక్కువగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి రోడ్డు, డ్రైనేజీలు కలిపి మొత్తం 82 అడుగుల మేర కొలతలు కచ్చితంగా ఉండాలని, అలాచేయలేని పక్షంలో పనులు ఆపివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన దీపికలు

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞానాన్ని ప్రసాదించే దీపికలని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరు బాపూజీ పార్కులోని గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం చెంచయ్య, గ్రంథాలయ నిర్వాహకురాలు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

● **గుడ్లూరు:** గ్రంథాలయం ద్వారా అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎర్రాప్రగడ గుడ్లూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. చిత్రలేఖనం, పాటలు, వ్యాస రచన, వక్తృవ్వ, క్విజ్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోవర్ధన్, హైస్కూల్ హెచ్‌ఎం రామోహన్‌రావు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డికి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డు


సురేష్‌రెడ్డికి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డు అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, తదితరులు

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అజ్ఞాత రక్తదాత స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి స్మారక అవార్డును జిల్లాలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసిన కోవూరుకు చెందిన దేవిరెడ్డి సురేష్‌రెడ్డికి అందచేశారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆ అవార్డును మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సురేష్ రెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలిరెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కే. హరినారపరెడ్డి, ఏరియా వైద్యశాల మాజీ సూప రింటిండెంట్ డాక్టర్ కే.సుబ్బారావు, నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ కలికి శ్రీహరిరెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్న కుమార్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, గోసల గోపాలరెడ్డి, పూనూరు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మెగా రక్తదానం, అన్నదానం

కావలి(టౌన్) : మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి 44వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఏరియా వైద్యశాల ప్రాంగణంలో మెగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు ముందుగా కాంటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించి ఆయనతో పాటు ఆయన సతీమణి శివప్రియలు స్వయంగా రక్తదానం చేశారు. రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోసల గోపాలరెడ్డి, బాలకృష్ణంరాజు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విష్ణు అభిమానులు పాల్గొన్నారు.

బాధితురాలికి బంగారు గడియారం అప్పగింత


బంగారు వాచీని చాముండేశ్వరికి అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి పాతూరు శివాలయంలో చాముండేశ్వరి అనే భక్తురాలు 14 గ్రాముల బంగారు గడియారాన్ని పోగొట్టుకోగా దానిని గురువారం ఆలయ సిబ్బంది ఆమెకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. పట్టణంలోని గాయిత్రినగర్‌కు చెందిన చాముండేశ్వరి గత సోమవారం ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించింది. అక్కడ నెలకొన్న రద్దీ సమయంలో తన బంగారు గడియారాన్ని పోగొట్టుకుంది. ఇంటికి వెళ్లిన తరువాత తన వాచీ పోయిందని తెలుసుకున్న ఆమె ఎక్కడ పోయిందో తెలియక ఆందోళన చెందింది. ఈ క్రమంలో ఆలయంలో పడి ఉన్న బంగారం వాచీ శివాలయం సేవకుడు పోలు వెంకటేశ్వర్లుకు దొరకటంతో ఆయన ఆలయ ఈవో అరవ రాధాక్రిష్ణకు అప్పగించి మైక్‌లో అనౌన్స్ చేయించారు. అయితే అప్పటికే ఆమె వెళ్లి పోవడంతో ఆ వాచీని ఆలయంలో భద్రపరిచారు. గురువారం మళ్లీ శివాలయానికి వచ్చిన చాముండేశ్వరి తన వాచీ పోయిన విషయాన్ని అక్కడ సిబ్బందితో, భక్తులతో చెప్పారు. దీంతో సిబ్బంది తమ వద్ద వాచీ ఉందని తెలిపి ఆ వాచీకి సంబంధించిన సరైన ఆధారాలు చూపమని కోరడంతో ఆమె చెప్పిన ఆధారాలతో ఆలయ సిబ్బంది ఆమె దగ్గర లిఖిత పూర్వకంగా రాయించుకుని బంగారం వాచీని అందజేశారు. దీంతో ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శేషారెడ్డి

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలకు సిఫార్సు చేస్తామని ఏవో శేషారెడ్డి తెలిపారు. వలేటివారిపాలెంలోని హరిత పుత్ర వెజిటల్ అండ్ మిలెట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ షాపును గురువారం ఆయన తనిఖీ చేశారు. షాపులోని రికార్డులు, ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. అనుమతిలేని మూడు కంపెనీలకు చెందిన 36.09 మెట్రిక్ టన్నులు డీఏపీ, అమ్మోనియం సల్ఫేట్, యూరియా ఎస్ఎస్‌పీకి సంబంధించిన రూ.4,25,480 విలువ కలిగిన ఎరువులను నిలుపుదల చేశారు. మండలంలోని అన్ని దుకాణాలలో ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి


తహసీల్దారు కోటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

లింగసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు అధికారులకు అనుసంధానంగా ఉన్న గ్రామ సేవకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండలంలోని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సుదీర్ఘ కాలం నుంచి పని చేస్తున్న వీఆర్ఏలకు పే స్కేలు ఇచ్చి, జీతాలు పెంచాలన్నారు. అర్హత గల వీఆర్ఏలకు వీఆర్‌వోలుగా, రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలు పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అటెండరు, నైట్ వాచ్‌మ్యాన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ నైట్ డ్యూటీలను, అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు జడ చంద్రశేఖర్, షేక్ నబీసాహెబ్, ఏ కొండయ్య, జీ.కొండయ్య, జీ.దత్తుకుమార్, కే.వేణుగోపాల్, శ్రీనివాసులు, సీహెచ్ నరసింహం, రహీంబీ, జంగమయ్య, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సంఘం సభ్యులు

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ విజిలెన్స్ అధికారిగా పని చేసి ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న వై.సతీష్‌కుమార్ మృతిపై ఉన్నత దర్యాప్తు సంస్థచే సమగ్ర విచారణ జరిపించాలని కావలి కుమ్మర శాలివాహన సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కుమ్మర శాలివాహన సంఘం నేతలు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన అధికారి సతీష్‌కుమార్ మృతికి కారణమైన దోషులు ఎంత టి వారైనా కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి తగిన పరిహారం ఇచ్చి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యోగూరు పెద పుల్లయ్య, గుడ్లూరు మాల్యాద్రి, యోగూరు చిన పుల్లయ్య, బెజవాడ ప్రసన్న కుమార్, అబిసాగర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉలవపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, ఉలవపాడు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. సంబంధిత ఎరువుల కంపెనీలకు చెందిన శాంపిల్స్‌ను తీసుకొని నాణ్యతా ప్రమాణాల నిర్ధారణకు ప్రయోగశాలకు పంపించారు. ధ్రువీకరించిన కంపెనీలకు సంబంధించిన ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

కావలి(టౌన్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో జేబీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత స్పెషల్ క్యాంపు రెండవ రోజు పరిసరాలు పరిశుభ్రం చేశారు. కాలనీలోని చెత్తాచెదాలు తొలగించి రోడ్డుకిరువైపులా తేమ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, రామ్ సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘పద్మావతి’ చెంత ప్రథమ పౌరురాలు


రేణిగుంట విమానాశ్రయం

సాయంత్రం 4.05 గంటలు. ఒడిశా రాష్ట్రం ఝార్సుగూడా నుంచి ప్రత్యేక విమానం రేణిగుంట విమానాశ్రయం చేరుకుంది. విమానం నుంచి దిగిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్, ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజకుమారి, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

ఏడుకొండల స్వామి దర్శనానికి దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం సాయంత్రం జిల్లాకు వచ్చారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- రేణిగుంట/తిరుచానూరు/తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆలయంలో అరగంటకుపైగా

పద్మావతి ఆలయం వద్ద గ్రీన్ రూమ్‌లోకి వెళ్లిన రాష్ట్రపతి పది నిమిషాలు విశ్రాంతి తీసుకున్నారు. 4.55 గంటలకు ఆలయంలోకి విచ్చేశారు. మొదట ధ్వజస్తంభానికి మొక్కారు. సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. లడ్డు ప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని ఈవో బహూకరించారు. ఆలయం వెలుపలకు వచ్చిన ఆమె 5.26 గంటలకు తిరుమలకు బయలుదేరారు.



పద్మావతి అమ్మవారి ఆలయం

4.40 గంటలు: కుమార్తె, మనవడు, మనవరాలు తదితరులతో కలిసి రాష్ట్రపతి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహద్వారం వద్ద దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి అనిత, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరిందర్‌నాథ్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో రాష్ట్రపతి

సాయంత్రం 6.15 గంటలు: తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హోంమంత్రి అనిత, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు పనబాక లక్ష్మి, జానకీ దేవి, భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. రిసెప్షన్ అధికారులు వసతి, దర్శన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం క్షేత్రసంప్రదాయం ప్రకారం తొలుత వరాహస్వామిని.. ఆ తర్వాత వేంకటేశ్వరస్వామిని రాష్ట్రపది దర్శించుకుని తిరుగు ప్రయాణంకానున్నారు.



రామదూతపై అభయప్రదాత

తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామదూత హనుమంతుడిని వాహనంగా చేసుకుని పట్టాభిరామునిగా పద్మావతి అమ్మవారు గురువారం రాత్రి భక్తులకు అభయమిస్తూ ముందుకు సాగారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై మురళీకృష్ణ అలంకరణలో అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయర్‌స్వాముల దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటం, భజనలు, కళాకారుల నృత్యప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణ నడుమ వాహన సేవలు సాగాయి. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం. సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులుపాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 8 గంటలకు పల్లకీ ఉత్సవం
సాయంత్రం 3.30 గంటలకు వసంతోత్సవం
రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ







టైగర్ రొయ్యకు ‘వైట్‌స్పాట్’


రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైట్‌స్పాట్ వైరస్ ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రొయ్యలను పట్టేసి విక్రయిద్దామనుకుంటున్న తరుణంలో అల్పపీడన ద్రోణి కారణంగా విపరీతమైన చలితో పాటు మంచు కురుస్తోంది. అదే సమయంలో వైట్‌స్పాట్ వైరస్‌తో రొయ్యలు మృత్యువాత పడుతుండటంతో ఆక్వా రైతులు విలవిలలాడుతున్నారు. సముద్ర తీర ప్రాంతాలైన చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో టైగర్, వెనామి రొయ్యల పెంపకం చేపట్టారు. వాతావరణంలో మార్పులు, విపరీతమైన మంచు కురుస్తుండటంతో టైగర్ రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. నీటిలో ఉన్న రొయ్యలకు 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండాలి. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల 11 నుంచి 12 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోవడంతో రొయ్యలు వైరస్ బారిన పడుతున్నాయి. దీంతో రొయ్యలు మేత తినకుండా బరువు తగ్గి చనిపోతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా కోట మండలంలోని వావిళ్ల దొరువు, శ్రీనివాససత్రం, దొరువుకట్ట, ఉత్తమనెల్లూరు గ్రామాల్లో వైట్‌స్పాట్ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.


వైట్‌స్పాట్‌తో మృతి చెంది ఉన్న టైగర్ రొయ్యపిల్లలు

వర్క్ హార్డ్.. అచీవ్ లాట్

విజయానికి దగ్గరి దారి లేదన్న భువనేశ్వరి

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ‘విజయానికి దగ్గరి దారి అనేది లేదు. వర్క్ హార్డ్ అండ్ అచీవ్ లాట్ అంతే.’ సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ అన్న మాటలివి. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరమసముద్రం వద్ద గల కేజీబీవీ, గురుకుల పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ‘పేద కుటుంబాలనుంచి ఎన్నో కష్టనష్టాలకోర్చి ఇక్కడిదాకా వచ్చి చదువుకుంటున్న పిల్లలు బాధ్యతగా మెలగాలని సూచించారు. ‘మీలాగే ఎంతోమంది పేద పిల్లలు ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో చదువుకుంటున్నారు. అక్కడ నూరు శాతం రిజల్ట్స్ వస్తాయి. నాకు ఆ పిల్లల్ని చూస్తే చాలా గర్వంగా ఉంటుంది.’ అన్నారు. అబ్దుల్ కలాం, ధీరూబాయ్ అంబాని, ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు వంటివాళ్లు పేద, మధ్యతరగతి కుటుంబాలనుంచి వచ్చి ఉన్నత స్థానాలకు చేరారని గుర్తు చేశారు. ఇంకా ఎంతోమంది పేదరికాన్ని ధిక్కరించి ఎన్నో లక్ష్యాలను సాధించారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఉద్బోధించారు. ‘ఒక తల్లిగా చెబుతున్నా. టీనేజిలో ఉన్న ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరినీ నమ్మొద్దు. చదువుమీద, ఉన్నత లక్ష్యంమీద ఫోకస్ ఉండాలి. జీవితంలోపైకి ఎదగాలి’ అని సూచించారు. శ్రమిస్తేనే ఏ విజయమైనా దక్కుతుందన్నారు. కేజీబీవీ స్కూల్‌లోనే విద్యార్థులతో కలిసి భోంచేశారు. అక్కడ్నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో వెళ్లారు.


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన క్యూలో నిలుచున్న భువనేశ్వరి

■ నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

అపార మత్స్య సంపద

అపారమైన మత్స్య సంపద తిరుపతి జిల్లాకు ఆదాయవనరుగా మారింది. 80 కిలోమీటర్ల సముద్రతీరం, పులికాట్ సరస్సు ఇందుకు ప్రధాన కారణం కాగా, ఊరూరా ఉన్న చెరువుల్లోనూ మంచినీటి చేపల పెంపకం విస్తృతంగా జరుగుతోంది. సముద్రం, పులికాట్‌ల నుంచి ఏటా 60 వేల టన్నులకు పైగా చేపలు, 20 వేల టన్నుల రొయ్యలు లభిస్తున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. మంచినీటి చేపల ఉత్పత్తి వల్ల కూడా రూ. 300 కోట్ల ఆదాయం జిల్లా పొందుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


గండి రకం చేపలు




రొయ్యలు


గురకలు రకం చేపలు

కొరమేను చేపలు


బొచ్చె రకం చేప

ఏటా పాతిక వేల టన్నుల ఉత్పత్తి

రూ.300 కోట్లకు పైగా వార్షికాదాయం

జిల్లా మత్స్య సంపద
మత్స్యకార గ్రామాలు: 42
మత్స్యకార కుటుంబాలు: 14,874
మత్స్యకార జనాభా: 70 వేలు
మత్స్యకారుల సంఖ్య: 17,874
ఆక్వా రైతుల సంఖ్య: 2219
చేప పిల్లల పెంపకం కేంద్రాలు: 3
చేపల చెరువులు: 570

ఆక్వా రైతులు నిర్వహిస్తున్న చేపల చెరువులు: 6445



ప్రాజెక్టుల్లోనూ చేపల పెంపకం

జిల్లాలో 570 చెరువుల్లో చేపల పెంపకం జరుగుతోంది. దీనికి అదనంగా మత్స్యశాఖ తిరుపతిలోనూ, కళ్యాణీ డ్యామ్, అరణియార్ ప్రాజెక్టుల వద్ద స్వయంగా చేప పిల్లల పెంపకం కేంద్రాలు నిర్వహిస్తోంది. ఇక కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో ఆక్వా రైతులు చేపల, రొయ్యల పెంపకం పెద్ద ఎత్తున చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2219 మంది ఆక్వా రైతుల 6445 చిన్నచిన్న చేపల చెరువులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో మంచినీటి చేపలు ఏటా 25 వేల టన్నుల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో సహజ సిద్ధంగా 15 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతుంటే ఆక్వా రైతుల పెంపకం ద్వారా 10 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. 20 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఈ చేపల ఎగుమతి, విక్రయాల ద్వారా రూ. 300 కోట్ల మేరకు వార్షికాదాయం లభిస్తోంది.ఈ ఏడాది కూడా మత్స్య శాఖ జిల్లావ్యాప్తంగా 25 లక్షల చేపల పెంపకం లక్ష్యంగా పిల్లలను చెరువులు,రిజర్వాయర్లలో విడుదల చేసింది. ఈ ఏడాది పుష్కలంగా వానలు కురిసి చెరువులు, రిజర్వాయర్లలో నీళ్ళు నిండుగా వుండడంతో చేపల ఉత్పత్తి అంచనాలకు మించి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్థానికంగా దొరికే చేపల రకాలు

జిల్లాలో చెరువులు, రిజర్వాయర్లలో బొచ్చె (కట్ల), గండి (రోహు), మోసు (మృగాల), బంగారుతీగ, పక్కిలు, బెడిసెలు, జెల్లలు, ఇసుక పురి, గెరిగేని, కొరమేను, గురకలు లేదా జిలేబీలు (తిలాపియా), బొమ్మిడాలు, తేలుమాయి, వనామీ వంటి చేపలు ఎక్కువ పరిమాణంలో దొరుకుతున్నాయి.

లాభాలిచ్చేవి ఇవీ.. : జిల్లా పరిస్థితులను బట్టి చూస్తే గండి, బొచ్చె, మోసు, రూప్‌చంద్, ప్యాంగాసియస్ రకాల చేపలు ఆక్వా రైతులకైనా, మత్స్యకారులకైనా లాభదాయకమని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్పత్తి ఎక్కువగా వుండడం, విక్రయాలు బాగా వుండడమే దీనికి కారణమని చెబుతున్నారు.


వాకాడు మండలంలోని చేపల చెరువులు


గురక లేదా జిలేబీ రకం చేప


మోసు రకం చేపలు

సమగ్ర శిక్ష ఏపీసీగా మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధ

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో సమగ్ర శిక్షా విభాగం అదనపు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా తిరుపతి పద్మావతీ మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నున్నం అనురాధ నియమితులయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు వేర్వేరు శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులను డెప్యుటేషన్‌పై సమగ్ర శిక్షా ఏపీసీలుగా నియమించింది. అందులో భాగంగా స్థానిక మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధను డెప్యుటేషన్‌పై అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీగా నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాదిపాటు కొనసాగనున్నారు.

విద్యార్థులకు రవాణా భత్యం విడుదల

● మొదటి విడతగా రూ.2.02 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ

తిరుపతి (విద్య), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అర్హులైన విద్యార్థులకు రవాణా భత్యాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటరు దూరం, ప్రాథమిక పాఠశాలలకు 3 కిలోమీటర్లు, ఉన్నత పాఠశాలలకు 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆమేరకు 6,752 మంది విద్యార్థులను విద్యాశాఖ గుర్తించింది. వీరికి మొదటి విడతగా రూ.2,02,56,000 ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసినట్టు డీఈవో తెలిపారు.



ఎంవోయూను టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

8 నుంచి అలిపిరి పాదాలమండపం పనులు

తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అలిపిరి పాదాల మండపం పునరుద్ధరణ పనులు డిసెంబరు 8 నుంచీ మొదలు కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఎంవోయూ గురువారం టీటీడీ, లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టు మధ్య జరిగింది. పూణేకు చెందిన ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఈపాదాల మండపాన్ని దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. సంతకం చేసిన ఎంవోయూ పత్రాలను ట్రస్టు ప్రతినిధులు గురువారం టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేశారు.



శ్రీవారిసేవలో మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే సినీ నిర్మాత దిల్ రాజు సతీమణి తేజస్విని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అచ్చెన్నాయుడికి ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,121

తలనీలాలు సమర్పించినవారు: 22,426



మనసు దోచిన కళారూపాలు



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వాహన సేవల ముందు విభిన్న సంస్కృతులు, కళాప్రదర్శనలు భక్తుల మనసును దోచాయి. రాత్రి జరిగిన హనుమంత వాహన సేవ ముందు.. ఫ్యూజన్ క్లాసికల్, కోలాటం, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆండాల్ వైభవం, చెక్కభజన, అమరావతి డ్రమ్స్, కోలాటం, ఎస్వీ సంగీత , నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీరామపట్టాభిషేకం, భరత నాట్యం, నెమలినృత్యం, దాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, తాళం డ్యాన్స్ కోలాటం ఆకట్టుకున్నాయి.
హనుమంత వాహనసేవలో మొత్తం 15 కళాబృందాలు ప్రదర్శనలు చేశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

నేడు అమ్మవారికి గజవాహనసేవ



మాడవీధుల్లో తొక్కిసలాట జరగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుచానూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవ జరగనుంది. తిరుమలలో శ్రీవారి గరుడసేవకున్న ప్రాముఖ్యత.. తిరుచానూరులో గజవాహనసేవకు ఉంటుంది. తిరుపతి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గజవాహన సేవ తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తారు. దీంతో మాడవీధుల్లో ఎలాంటి తొక్కిసలాటలు, తోపులాటలు చోటుచేసుకోకుండా టీటీడీ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసింది. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఆలయ మాడవీధుల్లో గజవాహన సేవ ఏర్పాట్లు పరిశీలించారు. ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసు, విజిలెన్సు సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతిరోజు వాహన సేవలు రాత్రి 9 గంటలకు ముగిస్తే, గజ, గరుడ వాహనసేవలకు మాత్రం రాత్రి 11గంటల వరకు వాహనసేవ కొనసాగే అవకాశం ఉంది.

తిరుమల నుంచి నేడు లక్ష్మీకాసుల హారం రాక

గజవాహన సేవ నేపథ్యంలో అమ్మవారికి అలంకరించేందుకు తిరుమలలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శుక్రవారం ఉదయం తీసుకురానున్నారు. ఈ హారాన్ని శోభాయాత్రగా తీసుకొచ్చి.. గజవాహన సేవలో అమ్మవారికి అలంకరిస్తారు.

అన్యమత చిహ్నాలతో తిరుమలకు వాహనం

- అలిపిరి భద్రతా ఉద్యోగిపై చర్యలు



తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్యమత చిహ్నాలతో ఉన్న వాహనాన్ని గుర్తించి అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించారంటూ అలిపిరి టోల్ సిబ్బంది ఒకరిని విధుల నుంచి టీటీడీ తొలగించింది. టీఎన్ 31 ఏఈ 4073 నెంబరు గల టెంపో ట్రావెలర్ గురువారం అలిపిరి దాటి నిరాటంకంగా తిరుమలకు చేరుకుంది. ఫైర్‌స్టేషన్‌కు వెనుక పార్కింగ్‌లో ఉన్న తమిళనాడుకు చెందిన ఈ వాహనంలో అన్యమత చిహ్నం, స్టిక్కర్‌తో ఉండడాన్ని కొందరు గుర్తించి విజిలెన్స్, మీడియాకు సమాచారమిచ్చారు. విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని అన్యమత చిహ్నాలను తొలగించారు. కాగా అలిపిరి తనిఖీ కేంద్రంలోని తొమ్మిదోలైన్ నుంచి వాహనం వచ్చిందని గుర్తించి, అక్కడ విధుల్లో ఉన్న వాసు అనే భద్రతా ఉద్యోగిని తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని టీటీడీ తెలిపింది. వాహన డ్రైవర్ గోబి, యజమానిపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు





పోలీసు ఆంక్షలతో నిర్మానుష్యంగా ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయ పరిసర వీధులు - కలెక్టరేట్ వద్ద హైవేపై ఆగిన వాహనాలు

తిరుచానూరు/తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా గురువారం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న టాక్సీలను ఉదయం నుంచీ పార్కింగ్‌లోకి తరలించారు. టాక్సీ బుకింగ్ కౌంటర్ల వద్ద ఎవరినీ అనుమతించలేదు. ఇక, మధ్యాహ్నం 3 గంటల తర్వాత హైవే నుంచి అమ్మవారి ఆలయం వరకున్న మార్గంలో రాకపోకలను నిషేధించారు. తిరుపతి నుంచి తిరుచానూరుకు యధావిధిగా రాకపోకలకు అనుమతించారు. ఆలయ సన్నిధి వీధిలోనూ దాదాపు రెండు గంటల పాటు ఎవరినీ రానీయలేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను సాయంత్రం 4గంటల వరకు అనుమతించి.. ఆపై ఆపేశారు. రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని తిరుమలకు బయలుదేరాక భక్తులను యథావిధిగా అనుమతించారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జాతీయ రహదారిలో కొంతసేపు ఇరువైపులా వాహన రాకపోకలను పోలీసులను నిలిపివేశారు. అక్కడక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, తిరుమలలోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి బస చేసే అతిథిగృహం వద్ద పటిష్ఠ భద్రతను కల్పించారు. పాసులున్న అధికారులు, సిబ్బంది మినహా మిగతా ఎవరూ ఆ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. కాన్వాయ్ రావడానికి ముందే దుకాణాలు మూసివేయాలనే ఆదేశాలు జారీ చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తాం

- కుప్పం నియోజకవర్గ ప్రజలు ముందుకు రావాలన్న సదరన్ డిస్కం సీఎండీ



సోలార్ విద్యుత్ ప్లాంటును పరిశీలిస్తున్న సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

శాంతిపురం/తిరుపతి(ఆటోనగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అన్నారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సూర్యఘర్ యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూఫ్ టాప్ సోలార్ సిష్టమ్స్ పనులు, బల్ల వద్ద నిర్మాణ దశలో వున్న 33-11 కేవీ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. గృహాలపై జరుగుతున్న సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణపనుల తీరును చూశారు. ఈ పథకం అమలుతో కలిగే ప్రయోజనాలను తమ సిబ్బంది వివరించారా అని గృహ యజమానులను అడిగారు.సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కుసుం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్లాంట్ పూర్తి చేస్తే రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ డిస్కం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, రెస్కో ఎండీ ఎస్.సోమశేఖర్, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఛాతీ భాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

- శస్త్ర చికిత్సతో రాడ్డును తొలగించిన రుయాస్పత్రి వైద్యులు



పది రోజుల కిందట బాధితుడి ఛాతీభాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఓ వ్యక్తి ఛాతీ భాగానికి రెండు వైపులా 1.5 మీటర్ల ఇనుపరాడ్డు చొచ్చుకుపోయింది. అతిక్లిష్టమైన శస్త్రచికిత్సతో ఆ రాడ్డును తొలగించి ఆ వ్యక్తి ప్రాణాలు నిలబెట్టడం గొప్ప విషయం' అని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ అన్నారు. తిరుపతిలోని రుయాస్పత్రిలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'అనంతపురానికి చెందిన షేక్ వల్లి(44) ద్విచక్ర వాహనంపై దుస్తులు అమ్ముకుంటూ శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. పదిరోజుల కిందట దుస్తుల వ్యాపార నిమిత్తం నగరికి వెళ్లి తిరిగి పుత్తూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై బస్సును అధిగమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడ్డారు. ఆ సమయంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటంతో అక్కడ ఏర్పాటు చేసివున్న 1.5 మీటర్ల ఇనుపరాడ్డు అతని ఛాతీ భాగంలో ఒక వైపు గుచ్చుకొని మరో వైపు బయటకు వచ్చింది. అదే సమయంలో అటుగా వెళ్లే కొందరు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో వారు అయన్ను రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో బాధితుడు స్పృహలో లేకపోవడం, అతడి వివరాలు వెల్లడించేందుకు కుటుంబ సభ్యులూ లేరు. బాధితుడి పరిస్థితి చూసి రుయాస్పత్రిలోని కార్డియోథొరాసిక్, అనస్థీషియా, సర్జరీ విభాగాల వైద్యాధికారులు హుటాహుటిన శస్త్రచికిత్సను ప్రారంభించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను చేసి వ్యక్తి శరీరంలో ఊపిరితిత్తులకు, గుండెకు మధ్యలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డును తొలగించి బాధితుడి ప్రాణాలు నిలబెట్టారు. శస్త్ర చికిత్స అనంతరం పది రోజులుగా షేక్ వల్లిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాం' అని ఆమె తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో అనుభవం కలిగిన వైద్యనిపుణులు కళ్యాణి రమ, గౌతమి, పద్మ, శ్రీనివాసులు, జ్ఞాపిక, రవిశంకర్ బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసి రుయాస్పత్రి స్థాయిని మరింత పెంచారని ఆమె అభినందించారు. పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్న ఇటువంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు షేక్ వల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

25న వెంకటగిరిలో జాబ్‌మేళా

వెంకటగిరి, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను టీడీపీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ కస్టర్, తిరుపతి, చెన్నైలోని 14 బహుళ జాతి కంపెనీల్లో 720 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల పిలుపునిచ్చారు. విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మాల్యాద్రి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు హెచ్‌టిటిపిఎస్-ఎన్ఏజేపియూఎన్‌వైఏఎం.ఎపి.జీవోవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7013509543, 9491458910, 9988853335 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, పక్కన లైబ్రేరియన్ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని మున్సిపల్ మేనేజర్ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం సూళ్లూరుపేట గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు గ్రంథాలకు వెళ్లి గ్రంథాలు, మంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. చదువుతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. లైబ్రేరియన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వినూత్న ఆలోచనతో నూతన ఒరవడిని సృష్టించేందుకు, సంస్కారవంతమైన జీవితానికి గ్రంథా యాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది వంకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులపై బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో మునికుమారి అన్నారు. కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో గురువారం జాతీయ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా బాలికలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ సమాజంలో మహిళాసాధికారిత, మహిళల రక్షణ కోసం అమలులోకి ఉన్న చట్టాల గురించి వివరించారు. అలాగే పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. 1098, 181, 112, హెల్ప్‌లైన్ నెంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక



వెంకటలోకేశ్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయోలా జూనియర్ కళాశాల విద్యార్థి వెంకటలోకేశ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడని కరస్పాండెంట్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ ఇండియన్ రౌండ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో వెంకటలోకేశ్ ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్ సాధించాడని చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సిల్వర్‌మెడల్, ఇండియన్ జూనియర్, సీనియర్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధిండన్నారు. ఈనెల 24నుంచి 30వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవ నిలయంలో గురువారం పట్టణంలోని పలు పాఠశాలు, కళాశాలల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఏటా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్లికార్జున, సత్యనారాయణ, మనోజ్ కుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అదృశ్యం కావడంతో వారి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న శివసాయి, అక్షిత్ గురువారం వాష్‌రూంకు వెళ్లి వస్తామని ఉపాధ్యాయుడుకి చెప్పి ప్రహరీ దూకి బయటకు వెళ్లిపోరారు. యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో గాలించినా వారు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని 4 నంబరు ప్లాట్‌ఫాంలో చెన్నై వెళ్లే రైలులో ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. వారిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తిరుపతయ్య తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ఓజిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఓజిలి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధారం కేంద్రంలో ఈనెల 27 వరకు సేవలు అందిస్తామన్నారు. ఆధార్ లేని పిల్లలకు నమోదు చేయించాలని తలిదండ్రులకు సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



అండర్‌బ్రిడ్జి కింద దెబ్బతిని గుంతలు పడిన రోడ్డు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అండర్‌బ్రిడ్జి వద్ద రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరునిల్వ చేరి ప్రమాదాలకు కారణమవుతోందని చెబుతున్నారు. ప్రధానంగా గూడూరు ఒకటో - రెండో పట్టణాల ప్రజలు ఈ బ్రిడ్జి కింద రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నెల్లూరు వైపు నుంచి బనిగిసాహెబ్‌పేట మీదుగా ఈ అండర్‌బ్రిడ్జి ద్వారానే తిరుపతి, వెంకటగిరి, రాపూరు మార్గాలకు వెళ్లే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు: కురుగొండ్ల



ఆస్పత్రిలో వైదుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోతే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రికిని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స గురించి ఆరా తీశారు. డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉన్నారా? లేదా? అని అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రిలో కొన్ని గదులకు తాళం వేసి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే సిబ్బందిని ప్రశ్నించారు. గదుల తాళాలు తమ వద్ద లేవని, ఇన్‌చార్జి డాక్టర్ జిలానీ భాషా దగ్గర ఉన్నాయని, ఆయన సెలవుపై వెళ్లారని సిబ్బంది చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో గదులకు తాళాలు వేసి ఇంటికి తీసుకెళ్లడానికి ఆయన ఆయన సొంత ఆస్తా, ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కురుగొండ్ల మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ట్రామాకేర్ సెంటర్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో మురళీకృష్ణ

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో యూరియా అందించేలా వ్యవసాయాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలతో సంబంధం లేకుండా పంటలు సాగుచేసే రైతులందరికీ యూరియా అందింఆలని కోరారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో పక్కాగృహాల మంజూరుకు అర్హులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేందుకు సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో కాంచన, సీడీపీవో జ్యోతికిరణ్, పేర్నాడు వైద్యాధికారిణి జయశ్రీ, గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సత్యనారాయణ, భవాని, ఏపీఎం ప్రసన్న, ఏపీవో లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముంపు పొలాలను కాపాడండి



వీఆర్వో బాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

తడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముంపు పొలాలను కాపాడాలంటూ వేనాడు పంచాయతీ ఆలపత్రి రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. గురువారం తహసీల్దారును కలిసేందకు వెళ్లగా ఆయన లేకపోవడంతో వీఆర్వో బాబుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీళ్లు చేరాయని, అవి దిగువ పొలాల మీదుగా పులికాట్‌లో కలవాల్సి ఉందని, కాని కొందరు రైతులు అడ్డుకట్టవేయడంతో పంటలు నీట మునిగాయన్నారు. సుమారు 100 ఎకరాలకు పైగా వరిపంట పాచిపోయే పరిస్థితికి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని వీఆర్వో బాబు చెప్పారు.

గోవిందపల్లిపాళెంలో సాగర్ కవాచ్



గోవిందపల్లిపాళెంలో మెరైన్ ఎస్‌ఐ శివసౌమ్య, సిబ్బంది

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం, శ్రీనివాసనత్రం మత్స్యకార గ్రామాల్లో గురువారం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ జరిగింది. మెరైన్ సీఐ నారాయణరెడ్డి, ఎస్‌ఐ శివసౌమ్య, ఏఎస్‌ఐ రాధమ్మ ఆధ్వర్యంలో పోలీసులు సాగర్‌తీరంలో కవాతు నిర్వహించారు. సముద్రం నుంచి చొరబాటుదారుల కదలికలపై నిఘా ఉంచారు. సముద్రంలోకి గుర్తు తెలియని బోట్‌లు, స్టీమర్ల రాకను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం అందివ్వాలని మత్స్యకారులను కోరారు.

కోనేరులో కార్తీక దీపాలు



కోనేరులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజున స్థానిక కోనేటిమిట్టలోని అంజేయస్వామి తెప్పకోనేరులో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. నెలరోజుల పాటు కార్తీక మాసంలో కార్తీక పూజలు జరిపారు. గురువారం చివరిరోజు కావడంతో మహిళలు కోనేటి వద్దకు చేరు కుని ఆవునెయ్యి, నువ్వుల నూనెతో వెలిగించిన దీపాలను అరటి బొదెలపై ఉంచి నీటిలోకి వదిలి పూజలు జరిపారు. అనంతరం కోదండ రామాంజ నేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెంలో గిరిజనులకు చెందిన శ్మశాన భూమి ఆక్రమణపై మాజీ సర్పంచ్ ఆనందయ్య ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. గిరిజనుల శ్మశాన భూమి కొందరు ఆక్రమించారని చెప్పారు. కాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశానవాటిక ఆక్రమణను తొలగించాలని తహసీల్దారును గిరిజనులు కోరారు.

వైసీపీ సంతకాల సేకరణ

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశా లల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సూళ్లూరుపేట పట్టణంలోని గణపతి నగర్‌లో గురువారం వైసీపీ నేతలు సంతకాల సేకరణ చేప ట్టారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చిన్న సత్యనారాయణ, పోలూరు పద్మ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నిక ఏకగ్రీవం



చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న ఎంఈవో, టీడీపీ నేతలు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద గోవిందపల్లి ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం పార్వతిప్రవీణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఐ.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా టి.స్వాతితో పాటు మరో 15మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఎంఈవో మస్తానయ్య, టీడీపీ నాయకులు చెంగల్‌రావు, బాలకృష్ణగౌడ్, మురళి అభినందించారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం



కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం జరిగింది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తుల ఆధ్వర్యంలో మేళతాళాలు, కేరళ వాయిద్యాల నడుమ అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం సోమేశ్వర ఆలయంలో కార్తీమాస వనభోజనాలు, అన్నదానం జరిగింది.

జీవనోపాధులపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలు, ఈసీ సభ్యురాళ్లకు జీవనోపాధులపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం అనీల మాట్లాడుతూ పొదుపు మహిళలు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి ప్రగతికి బాటలు వేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీవోఏలు గ్రామాల్లోకి వెళ్లి మహిళలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, శంకర్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, బిందు, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి గొడుగుల వితరణ

తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి తమిళనాడుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్టు చైర్మన్ మాధవనాయుడు 8 గొడుగులను అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వీటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఎస్‌బీఐ నుంచి మంజూరైన రూ.20లక్షల బీమా చెక్కును చీఫ్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ శర్మ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన వెంకటరాజా(28) ఇటీవల మనుబోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆయన ఎస్‌బీఐలో సంవత్సరానికి రూ.1000 జనరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేవారని, ప్రమాదవశాత్తు మృతి చెందడంతో రూ.20 లక్షలు మంజూరైందన్నారు. ఆ చెక్కును అతని తల్లి చిన్నరత్నమ్మకు అందజేయడం జరిగిందన్నారు. ఖాతాదారులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వినోద్, ఇన్సూరెన్స్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రిన్సిపాల్, పీడీలకు క్రీడా పరికరాలను అందజేస్తున్న టీడీపీ నేత నానాజీ

చిల్లకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు తానంకి నానాజీ దాతృత్వంతో రూ.25వేలు విలువ చేసే క్రీడా పరికరాలను ప్రిన్సిపాల్, పీడీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని రాణించాలన్నారు. ఒత్తిడిని జయిస్తే చదువుల్లో రాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, మల్లికార్జున్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పీడీ శిరీష్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీనివాసులు గురువారం తెలిపారు. అనే జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విద్యార్థులు జాన్‌హానోక్, డానియల్ జాషువా, ప్రవీణ్, షాలోమ్‌స్నేహిత్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

సంఘమిత్రలు, వీవోఏలకు శిక్షణ

బాలాయపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాల యంలో సంఘమిత్ర సభ్యులు, వీవోఏలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం కిరణ్ మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధి అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణాధికారి చెంగల్ రాయులు, ఎల్‌సీ సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు చంద్రగిరిలో హాకీ టోర్నమెంట్

చంద్రగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం నుంచి హాకీ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ భార్గవి కిషోర్ తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి అండర్ 14 హాకీ టోర్నమెంటులో క్రీడాకారులు పాల్గొంటారని, ఇందులో బాలురు 234 మంది, బాలికలు 234 మంది ఉన్నారని వెల్లడించారు. పోటీలను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభిస్తారన్నారు. స్థానిక పీడీలు, పీఈటీల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.